పేదలకు కూటమి ప్రభుత్వం అండ

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పేదలకు అన్ని విధాల సంక్షేమ పథకాలు అందించేందుకు కసరత్తు చేసిందని కడప ఎమ్మెల్యే మాధవీరెడ్డి, టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు శ్రీనివాసులురెడ్డి తెలిపారు. శనివారం కడప నగరం 2వ డివిజన్‌లో స్థానిక కార్పొరేటర్ సుబ్బారెడ్డి, టీడీపీ నేతలు ఎద్దుల శంకర్ తదితరుల ఆధ్వర్యంలో డిజిటల్ రేషన్ కార్డుల పంపిణీ నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రస్తుతం పంపిణీ చేస్తున్నకార్డులు ప్రభుత్వ పథకాలు మొదలుకొని మరెన్నో కార్యక్రమాలకు ప్రామాణికంగా తీసుకోవడం జరుగుతోందన్నారు. ఈ విషయాన్ని గుర్తించిన కూటమి ప్రభుత్వం కార్డుల డిజిటలైజేషన్ ప్రక్రియ చేపట్టి ప్రజలకు అందించడం జరుగుతోందని వివరించారు. ప్రస్తుత ప్రభుత్వం క్యూఆర్ కోడ్, రాష్ట్ర చిహ్నం, కుటుంబ పెద్ద ఫోటోతో కూడిన కొత్త స్మార్ట్ డిజిటల్ రేషన్‌కార్డులను తీసుకు వచ్చిందన్నారు. లబ్దిదారులు ప్రభుత్వం పొందుతున్నతోడ్పాటును సద్వినియోగం చేసుకుని కూటమి ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే పలువురికి స్వయంగా డిజిటల్ కార్డులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షులు మన్సూర్ అహ్మద్, పలువురు టీడీపీ నేతలు, స్థానిక ప్రముఖులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

విశాలాంధ్ర

వైఎస్ఆర్ కడప జిల్లా | అన్నమయ్య జిల్లా

ఆదివారం 28, సెప్టెంబరు -2025 8 పేజీలు

ఖాకీ యూనిఫామ్ ప్రజల సేవ, రక్షణ కోసమే :ఎస్‌పి షెల్కే నచికేత్ విశ్వనాథ్

మహిళల రక్షణకు అత్యధిక ప్రాధాన్యత

వాట్సాప్, టోల్ ఫ్రీ నెంబర్లకు ఫిర్యాదు చేస్తే తక్షణ చర్యలు

కడప మునిసిపల్ కార్పొరేషన్‌లో సెల్ఫ్ హెల్ఫ్ గ్రూప్‌లకు భద్రత

విశాలాంధ్ర-కడప : మహిళల రక్షణకు జిల్లా పోలీస్ శాఖ అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని, వేధింపులు, ఇతర సమస్యలతో ఉన్న వారికి పోలీస్ శాఖ అండగా ఉంటుందని జిల్లా ఎస్.పి షెల్కే నచికేత్ విశ్వనాథ్ మహిళలకు భరోసా ఇచ్చారు. శనివారం స్థానిక మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో జిల్లా పోలీస్ శాఖ, మెప్మా సంయుక్త ఆధ్వర్యంలో స్వయం సహాయక బృందాల (సెల్ఫ్ హెల్ఫ్ గ్రూప్స్) సభ్యులకు 'మహిళల భద్రత-డ్రగ్స్ నిర్మూలన' పై అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా హాజరైన జిల్లా ఎస్.పి షెల్కే నచికేత్ విశ్వనాథ్ మాట్లాడుతూ ఖాకీ యూనిఫామ్ ప్రజల సేవ, రక్షణ కోసమే నని, పోలీస్ శాఖ సేవలు వినియోగించుకోవాలని సూచించారు. మహిళల భద్రత- డ్రగ్స్ నిర్మూలన పై రాష్ట్ర గౌరవ ముఖ్యమంత్రివర్యులు ప్రతి వారం సమీక్షిస్తు న్నారని, పోలీస్ శాఖ కూడా సీరియస్ గా దృష్టి సారించడం జరిగిందని తెలిపారు. పోలీస్ అధికారులు అందరూ తక్షణం స్పందిస్తున్నారని తెలిపారు.

డ్రగ్స్, గంజాయిపై ఉక్కుపాదం

కడప నగరంలో, జిల్లాలో డ్రగ్స్, గంజాయిపై గట్టి చర్యలు చేపట్టడం జరిగిందని జిల్లా ఎస్.పి తెలిపారు. పోలీస్ శాఖ చేపట్టిన కఠిన చర్యల వల్ల గంజాయి, డ్రగ్స్ పూర్తిగా అదుపులో ఉన్నాయన్నారు. సెల్ఫ్ హెల్ఫ్ గ్రూప్ మహిళలు ఎక్కడైనా డ్రగ్స్, గంజాయి సంబంధిత సమాచారం తెలిస్తే వెంటనే పోలీస్ శాఖ 1972 టోల్ ఫ్రీ నెంబర్ కు లేదా వాట్సాప్ నెంబర్ 8977781972 లకు తెలియచేయాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందన్నారు. అత్యవసర సాయం కోసం డయల్ 112, చైల్డ్ లైన్ హెల్ప్ లైన్ నెంబర్ 1098, గృహ హింస 181, మహిళల వేధింపులు 1091 , సైబర్ నేరాల టోల్ ఫ్రీ నెంబర్ 1930 లకు ఫిర్యాదు చేయాలని జిల్లా ఎస్.పి తెలిపారు. మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ మనోజ్ రెడ్డి మాట్లాడుతూ జిల్లా ఎస్.పి మహిళల భద్రత - డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన కార్యక్రమం చేపట్టడం సంతో షంగా ఉందన్నారు.మెప్మా పి.డి కిరణ్ కుమార్ మాట్లాడుతూ నిరక్షరాస్యత, పేదరికం వల్ల నేరాలు జరిగే అవకాశం ఉంటుందని, మెప్మా ద్వారా పేదరిక నిర్మూలనకు చేస్తున్న కృషి ని వివరించారు. జిల్లాలో 8 మునిసిపల్ పట్టణాలలో 14,556 స్వయం సహాయక బృందాలు ఉన్నాయని, ఒక్కో గ్రూప్‌లో 10 మంది సభ్యులుగా ఉంటారని వివరించారు. 'ఈగల్' ఆధ్వర్యంలో రూపొందించిన పోస్టర్లను జిల్లా ఎస్.పి ఆవిష్కరిం చారు. ఈ కార్యక్రమంలో కడప డిఎస్‌పి ఎ.వెంకటేశ్వర్లు, ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.రమాదేవి, డిసిపిఓ సుభాష్ యాదవ్, నగరంలోని సిఐలు, ఎస్‌ఐలు, డొమెస్టిక్ వయోలెన్స్ అడ్వకేట్ పర్వీన్, వన్ స్టాప్ సెంటర్ అడ్వకేట్ ఉమాదేవి, ఈగల్, నార్కోటిక్స్ విభాగం సిబ్బంది, కడప నగరంలోని సెల్ఫ్ హెల్ఫ్ గ్రూప్ మహిళలు పాల్గొన్నారు.

మరో యువకెరటం

-పులివెందులలో మారుతున్న రాజకీయ సమీకరణలు

-వైఎస్సార్ రాజకీయ వారసత్వ సంపదగా అభినవ్‌రెడ్డి

-అవినాష్‌రెడ్డికి తోడుగా ధ్రువతార

-బిటెక్ రవిని ఢీకొట్టేందుకు వైసిపి సరికొత్త వ్యూహం

-జగన్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం

విశాలాంధ్ర-పులివెందుల: పులివెందులలో రాజకీయ సమీకరణలు మారుతున్నాయా.. వైఎస్సార్ రాజకీయ వారసత్వ సంపదగా వైఎస్ అభినరెడ్డిని రంగంలో దింపు తున్నారా.. అవినాష్‌రెడ్డికి తోడుగా ధ్రువతార తెరపైకి రానున్నారా.. మరి ముఖ్యంగా బిటెక్ రవిని ఢీకొట్టేందుకు వైసిపి సరికొత్త వ్యూహం రచిస్తోందా.. ఇందుకు వైసిపి అధినేత పచ్చజెండా ఊపారా అంటే అవుననే సమాధానం వస్తోంది. వైసిపి అధినేత జగన్ సమీప దాయాది వైయస్ మదనమోహన్ రెడ్డి కుమారుడు వైఎస్ అభినవ్ రెడ్డిని రంగంలోకి దించేందుకు వైసిపి నడుంబిగించింది. దీంతో పులివెందులలో రాజకీ యాలు వేడెక్కనున్నాయి. ప్రస్తుతం వైయస్ అవినాష్ రెడ్డి ఒంటరిగా పోరాడుతుండడంతో. అభినవ్ రెడ్డిని రంగ ప్రవేశం చేస్తే అవినాష్ రెడ్డికి బలమైన తోడ్పాటు లభిస్తుందని వైసీపీ వర్గాలు భావిస్తున్నాయి. ప్రజలలో కూడా కొత్త ఉత్సాహం నెలకొం టుందని అభిప్రాయం వైసీపీ శ్రేణుల్లో వ్యక్తం అవుతోంది. ప్రస్తుతం పులివెందుల నియోజకవర్గ పరిధిలో టిడిపి ఇన్చార్జ్ బీటెక్ రవి గట్టిపట్టును సాధిస్తూ ప్రజలలో బలమైన స్థానం ఏర్పరచుకున్నట్లు టిడిపి వర్గాలు చెబుతున్నాయి. ఈ సందర్భంలో బిటెక్ రవి దూకుడును అడ్డుకోవాలంటే వైసీపీ తరఫున కొత్త నేత అవసరమనే భావన వైయస్సార్సీపి శ్రేణుల్లో వ్యక్తమవుతోంది. టిడిపి తరఫున బీటెక్ రవి వేగంగా పట్టు సాధిస్తున్న ఈ సమయంలో వైసీపీ భవిష్యత్తు వ్యూహాలకు అభినవ్ రెడ్డి కీలకపాత్ర పోషించనున్నారన్న ప్రచారం

2 లో

జగన్ నేతృత్వంలో న్యాయ యుద్ధానికి శ్రీకారం..డిజిటల్ బుక్ ప్రారంభం

విశాలాంధ్ర-రాయచోటి: అన్యాయాలు, అక్రమాలకు చమరగీతం పలికే ఆయుధంగా వైసిపి అధినేత వైఎస్ జగన్ తీసుకువచ్చిన డిజిటల్ బుక్ మారుతుందని వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు ఆకేపాటి అమర నాధరెడ్డి, హిందూపురం పరిశీలకులు రమేష్ కుమార్ రెడ్డిలు పేర్కొన్నారు. శనివారం అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటిలోని వైసిపి జిల్లా కార్యాలయంలో నిర్వహించిన డిజిటల్ బుక్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, నాయకులు ఎదుర్కొంటున్న అన్యాయాలు, రాజకీయ వేధింపులకు సరైన న్యాయ పూర్వక పోరాటం సాగించేందుకు డిజిటల్ బుక్ ఓ శక్తివంతమైన ఆయుధంగా మారుతుందని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి అన్నారు. డిజిటల్ బుక్‌ను రెండు మార్గాల్లో వినియోగించవచ్చని ఆయన తెలిపారు. ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా, ఐవీఆర్‌ఎస్ ఫోన్ 040-49171718 ద్వారా ఫిర్యాదు చేయవచ్చు. ఈ బుక్‌లో కార్యకర్తలు తమ అనుభవాలను, అన్యాయాలను, రాజకీయ దాడుల వివరాలను ఫోటోలు, ఆధారాలతో సహా అప్‌లోడ్ చేయవచ్చునని స్పష్టంచేశారు. ప్రతి కార్యకర్త అభిమాని తన మొబైల్‌లో డిజిటల్ బుక్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని, ప్రజలలోకి తీసుకెళ్లే బాధ్యతను తీసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. వైసిపి జిల్లా అధ్యక్షుడు ఆకేపాటి అమరనాధ రెడ్డి మాట్లాడుతూ ప్రజా వ్యతిరేక విధానాలను మానక పోతే కూటమి ప్రభుత్వం మూల్యం

2 లో

7న విజయవాడలో ఫ్యాప్టో ధర్నా

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : రాష్ట్రంలోని ఉపాధ్యాయుల అపరిష్కృత సమస్యలపై ప్రభుత్వ మొండివైఖరికి నిరసనగా అక్టోబర్ 7వ తేదీన విజయవాడ ధర్నా చౌక్ నందు వేలాది మంది ఉపాధ్యాయులతో నిర్వహిస్తున్న ధర్నాను విజయవంతం చేయాలని ఫ్యాప్టో రాష్ట్ర పరిశీలకులు మల్లు రఘునాథ రెడ్డి జిల్లాలోని ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. రాష్ట్ర ఫ్యాప్టో పిలుపుమేరకు విజయవాడలో చేపట్టబోయే ధర్నాను విజయవంతం చేయుటకు సన్నాహక సమావేశం కడప జిల్లా ఫ్యాప్టో చైర్మన్ ఎస్ఎండి ఇలియాస్ భాష అధ్యక్షతన వివిఆర్ ఎస్టియు భవన్ నందు జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న ఫ్యాప్టో రాష్ట్ర పరిశీలకులు మల్లు రఘునాథ రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయులను బోధనేతర కార్యక్రమాల నుండి తప్పించడం, అధికారంలోకి వచ్చిన వెంటనే మెరుగైన పిఆర్సి, మధ్యంతర భృతి మంజూరు, సి.పి.ఎస్ స్థానంలో

2 లో

రాజోలి జీవోను రద్దు చేయాలి..ఎమ్మెల్యే ఆది

భూములను విక్రయించుకొనే స్వేచ్ఛ కల్పించాలి

గండికోట నిర్వాసితులకు రూ.460 కోట్లు ఇవ్వాలి

విశాలాంధ్ర- ఎర్రగుంట్ల : శాసనసభలో శనివారం ప్రభుత్వ విప్, జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి ప్రసంగం సామెతలతో సాగింది. మాట్లాడవలసిందిగా డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణం రాజు ఆదినారాయణ రెడ్డిని కోరగానే.. పల్లెల్లో ఒక సామెత ఉంది అధ్యక్షా అంటూ.. అన్నం పెట్టకపోయినా పర్వాలేదు గానీ.. కుక్కను కట్టేయాలని చెప్పగా.. సభలో ఉన్న విష్ణుకుమార్ రాజుతో పాటు డిప్యూటీ స్పీకర్ సామెతను మరో మారు చెప్పవలసిందిగా కోరి చెప్పించుకోవడం విశేషం.. కుందూ నదిపై రాజోలి రిజర్వాయర్ నిర్మిస్తామని చెప్పి గత ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన జీవో ను రద్దుచేసి రైతులు తమ భూములను విక్రయించుకొనే వెసులుబాటు కల్పించాలని ఎమ్మెల్యే ఆది కోరారు. ఈ జీవో కారణంగా కర్షకులు తమ పొలాల క్రయవిక్రయాలు కోల్పోయారని విప్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ప్రభుత్వమైన రాజోలి రిజర్వాయర్ నిర్మించడమా.. జీవోను రద్దు చేయడమా.. నిర్ణయం తీసుకోవాలని ఎమ్మెల్యే ఆది కోరారు. గండికోట రిజర్వాయర్ భూ నిర్వాసితులకు రూ. 460 కోట్లు చెల్లించాలని పదేపదే ఆర్థిక శాఖను అడుగుతున్నా.. అడిగినా.. అడుక్కున్నా.. సమస్య అడుగునుంది కానీ.. అడుగు పడడం లేదని.. మీ ద్వారా అడుగుతున్నానని (డిప్యూటీ స్పీకర్‌ను) కోరి ఆదినారాయణ రెడ్డి ముగించారు.

మరో యువకెరటం

మొదటి పేజీ తరువాయి

నడుస్తోంది. వైయస్ అభినవ్ రెడ్డి పులివెందుల రాజకీ యాలలోకి మూడోతరం నేతగా అడుగుపెడుతున్నట్లు తెలుస్తోంది. ఇటీవల కాలంలో వైయస్ అభిషేక్ రెడ్డి మృతి చెందిన నేపథ్యంలో ఆయన స్థానంలోకి తమ్ముడు అభినవ్ రెడ్డి ప్రజాక్షేత్రంలోకి అడుగుడుతున్నట్లు తెలుస్తోంది. అభినవ్ రెడ్డి కూడా రాజకీయాల్లో అరంగేట్రం చేసేందుకు సుముఖంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో కూటమి నాయకులను సమర్ధవంతంగా ఎదుర్కోవడానికి అభినవరెడ్డి కథనరంగంలో అడుగు పెట్టనున్నట్లు సమాచారం. రాబోవు స్థానిక సంస్థల ఎన్నికలలో సత్తా చాటేందుకు అభినవ్ రెడ్డి అస్త్ర శాస్త్రాలను సిద్ధం చేసుకున్నట్లు కూడా తెలుస్తోంది. ఇటీవల జరిగిన జడ్పిటిసి ఎన్నికలలో పోలీసులను అడ్డుపెట్టుకొని టిడిపి నాయకులు విజయం సాధించారని తెలుసుకున్న వైసీపీ నాయకులు నిరుత్సాహంలో ఉన్నారు. అయితే వైయస్ అభినవ్ రెడ్డి రాజకీయ అరంగేట్రాన్ని ఆ పార్టీ నాయకులు కూడా స్వాగతి స్తున్నారు. ఇక ఎంపీ అవినాష్ రెడ్డిని కలవడానికి వేలాది సంఖ్యలో ప్రజలు వస్తుం టారు. ఒకే రోజు వేలాదిమంది రావడం వారి సమస్యల పరిష్కారం అవినాష్ రెడ్డికి భారమవుతోందని ఇలాంటి పరిస్థితుల నేపథ్యంలో అవినాష్ రెడ్డికి తోడుగా అభినవ్ రెడ్డి అందుబాటులో ఉంచేందుకు వైయస్ జగన్ సిద్ధమైనట్లు తెలుస్తోంది. అభినవ్ రెడ్డి రాకను యువత కూడా స్వాగతిస్తోంది. అభినవ్ రెడ్డి రాక కోసం ఆ పార్టీ శ్రేణులు నిరీక్షిస్తున్నారు.

జగన్ నేతృత్వంలో న్యాయ యుద్దానికి శ్రీకారం..డిజిటల్ బుక్ ప్రారంభం

మొదటి పేజీ తరువాయి

చెల్లించుకోక తప్పదని, వైఎస్ఆర్ సీపీ అధినేత వైఎస్ జగన్ ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా జిల్లా కేంద్రాలలో నేడు డిజిటల్ బుక్ ఆవిష్కరణ కార్యక్రమం జరుగుతోందని అన్నారు. ఈ నెల 28వ తేదీన అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాలలోనూ, 29వ తేదీన మండల కేంద్రాలలో డిజిటల్ బుక్ ఆవిష్కరణ కార్యక్రమాలు నిర్వహించబడతాయన్నారు. వైఎస్సార్సీపీ హిందూపురం నియోజకవర్గ పరిశీలకుడు రమేష్ రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ ఆరాచకాలకు, అక్రమాలకు, అన్యాయాలకు బలవుతున్న వారికి డిజిటల్ బుక్ శ్రీరామరక్షలా మారబోతోందని స్పష్టం చేశారు. పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు అందుబాటులోకి తీసుకొచ్చిన డిజిటల్ బుక్, ప్రజా వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న కూటమి ప్రభుత్వాన్ని నిలదీయడానికి ప్రధాన ఆయుధంగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఫయాజుర్ రెహమాన్, వైఎస్ఆర్ సీపీ రాష్ట్ర మైనారిటీ ప్రధాన కార్యదర్శి కొలిమి హారూన్ బాష, మైనారిటీ జిల్లా అధ్యక్షుడు బేపారి మహమ్మద్ ఖాన్, వైఎస్ఆర్ సిపి జిల్లా ఉపాధ్యక్షుడు పల్లపు రమేష్, మాజీ ఏపిఐఐసి డైరెక్టర్ శ్రీనివాసులు రెడ్డి, మున్సిపల్ విభాగపు రాష్ట్ర కార్యదర్శి రియాజుర్ రెహమాన్, కౌన్సిలర్లు సాదక్ అలీ, షబ్బీర్, సుగవాసి ఈశ్వర్ ప్రసాద్ ,సుగవాసి శ్యామ్, బిసి సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి విజయ భాస్కర్, పట్టణ ప్రధాన కార్యదర్శి బేపారి అసద్ తదితరులు పాల్గొన్నారు.

7న విజయవాడలో ఫ్యాప్టో ధర్నా

మొదటి పేజీ తరువాయి

మెరుగైన పెన్షన్ విధానం, ఆర్థిక బకాయిల చెల్లింపు, పెన్షనర్లకు కార్పొరేషన్ ఏర్పాటు వంటి హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి 16 నెలలు పూర్తయినా ఏ ఒక్క హామీ పూర్తిస్థాయిలో అమలు కాలేదని తెలిపారు. సిపిఎస్ ఉద్యోగులకు మెరుగైన పెన్షన్ విధానం అమలు చేస్తామని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చాక ఇంతవరకు చర్చించిన పరిస్థితి లేదన్నారు. ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్లు ప్రతి సంవత్సరము 180 కోట్ల రూపాయలు హెల్త్ కార్డుల అమలు కొరకు చెల్లిస్తున్నప్పటికీ హెల్త్ కార్డు పై వైద్యానికి ఏ హాస్పిటల్లో అంగీకరించడం లేదన్నారు. వెంటనే ప్లస్ టూ పాఠశాలల్లో ఖాళీలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. గురుకుల, ఆదర్శ,1998,2008 డీఎస్సీ ఎంటీఎస్ టీచర్ల పదవీ విరమణ వయస్సు 62 సంవత్సరాలకు పెంచాలన్నారు. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు వెంటనే ఎంటీఎస్ ను అమలు చేయాలని కోరారు. ఫ్యాప్టో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సయ్యద్ ఇక్బాల్ మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే స్పందించి ఉపాధ్యాయ సంఘాలతో విద్యా రంగ, ఆర్థిక సమస్యలపై చర్చించి పరిష్కరించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు. సమావేశంలో సెక్రటరీ జనరల్ రాళ్లపల్లి అబ్దుల్లా కార్యవర్గ సభ్యులు పీ.మహేష్ బాబు, కె.బాలగంగి రెడ్డి, నరసింహులు, షేక్ సాజిత్, బి.శివ శంకర్ రెడ్డి, సయ్యద్ సిరాజుద్దీన్, జి.రామ మోహన్, ఎల్.గంగిరెడ్డి, సురేంద్ర నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

విశాలాంధ్ర- పీలేరు : సిపిఎస్ ఎంప్లాయిస్ అసోసియేషన్, నోబెల్ టీచర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పీలేరు క్రాస్ రోడ్‌లో సీఎం నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్,,విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌లకు పీలేరు నియోజకవర్గ శాసన సభ్యులు నల్లారి కిషోర్ కుమార్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే మెగా డీఎస్సీని నిర్వహించి కేవలం 150 రోజుల్లో ఉపాధ్యాయ పోస్టులు నిర్వహించినందుకు గాను కృతజ్ఞతలు తెలియజేస్తూ పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నోబెల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు రెడ్డి రమేష్, ఏపీ సిపియస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అన్నమయ్య జిల్లా అధ్యక్షులు పచ్చార్ల సుధాకర్, ఉపాధ్యాయులు వేణుగోపాల్ రెడ్డి అమర్నాథ్ మస్తాన్, శ్రీనివాసులు, సుబ్రహ్మణ్యం ధర్మయ్య శివశంకర్ జనార్దన్ రెడ్డి జయరాం వేణుగోపాల్ కిరణ్ ఎం ఆర్ పి ఎస్ పీలేరు నియోజకవర్గ ఇన్చార్జి గండికోట వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించేందుకే శిక్షణా తరగతులు

ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి పల్లేటి రామసుబ్బారెడ్డి

విశాలాంధ్ర -రాజంపేట: జర్నలిస్టులకు వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించేందుకు రాజంపేట డివిజన్ కేంద్రంలో త్వరలో రెండు రోజులపాటు శిక్షణా తరగతులను నిర్వహించడం జరుగుతుందని ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి పల్లేటి రామసుబ్బారెడ్డి అన్నారు. శనివారం రాజంపేట పట్టణ కేంద్రంలోని రోడ్డు భవనాల అతిథిగృహంలో ఏపీయూడబ్ల్యూజే కమిటీ సభ్యులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానంకు అనుకూలంగా శిక్షణా తరగతులు ద్వారా మెలుకువలు నేర్చుకోవాలన్నారు. ప్రభుత్వాలు మారినప్పుడు కొత్త చట్టాలు అందుబాటులోకి రావడంతో వాటిపై కూడా అవగాహన పెంచుకోవలసిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆంధ్రప్రదేశ్ మీడియా ప్రెస్ అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేష్ కుమార్ విచ్చేస్తున్నారన్నారు. ఈ శిక్షణ తరగతుల్లో పాల్గొన్నటువంటి జర్నలిస్టులకు ఏపీ ప్రెస్ అకాడమీ ద్వారా సర్టిఫికెట్లను అందజేస్తామన్నారు. ఈ అవకాశాన్ని జర్నలిస్టులు

సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు భాస్కర్, తాలూకా అధ్యక్షులు ఇండ్లూరి చిన్న వెంకటరెడ్డి, సీనియర్ పాత్రికేయులు సుబ్బ నరసింహులు, రాయలు, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ ఉదయగిరి కళ్యాణ్, జిల్లా కార్యవర్గ సభ్యులు మండ్ల శ్రీహరి, రాజంపేట ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షులు శివయ్య నాయుడు, ప్రధాన కార్యదర్శి మందా శివయ్య, నాగేంద్ర ప్రసాద్, దుర్గయ్య, మధుసూదన్ నాయుడు, చౌడవరం నరసింహ, రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

సూపర్ జిఎస్టి తో ప్రజలకు సూపర్ సేవింగ్స్‌కు పునాది

సీఐ కృష్ణయ్య,ఎంపీడీవో వెంగ ముని రెడ్డి

విశాలాంధ్ర -అట్లూరు: అట్లూరు మండలం స్థానిక శ్రీ శక్తి భవన్లో కేంద్ర ప్రభుత్వం సవరించిన సూపర్ జీఎస్టీ, విధానంతో పేద మధ్యతరగతి ప్రజలఆర్థిక అభివృద్ధి పునాదికి అవకాశం గా కనిపిస్తుంది అని, బద్వేల్ రూరల్ సీఐ కృష్ణయ్య, ఎంపీడీవో వెంగ మునిరెడ్డి పేర్కొన్నారు. ఆయా సంబంధిత అధికారుల ఆధ్వర్యంలో సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్, మహిళా భద్రత, మత్తు పదార్థాల నివారణపై అవగాహన సదస్సులు సంయుక్త సమావేశాలు నిర్వహించారు. ఎంపీడీవో వెంగముని రెడ్డి మాట్లాడుతూ సూపర్ జీఎస్టీఅమలు వల్ల నిత్యావసర వస్తువుల ధరలు తగ్గడం,పేద,మధ్యతరగతివర్గాల వారికి పొదుపుగురించి,మహిళల సంరక్షణ గురించి తెలిపారు, సీఐ కృష్ణయ్య మాట్లాడుతూమహిళలు స్త్రీ శక్తి యాప్ ఉపయోగించడం,డ్రగ్స్ వాడకం వలన కలిగే నష్టాలు, అవగాహన కల్పించారు. అలాగే జీఎస్టీ సూపర్ జీఎస్టీ లోఏ వస్తువులకు 0%,5% వర్తిస్తాయి అంశాల గురించి వివరించారు.ఈ సమావేశం తరువాత వివో ఏలు,అధ్యక్షురాలు వెళ్ళి! గ్రామసమాఖ్య సమావేశం నిర్వహించి ఎస్ హెచ్ జి సభ్యులందరికీ జీఎస్టీ, గురించి,మహిళల సంరక్షణ,డ్రగ్స్ పై అవగాహన కల్పించాలని ఆదేశాలిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపిఎం సురేష్ బాబు, వెలుగు సిసి లు, వివో ఏ లు. ఎంఎస్ఏలు, మండల సిబ్బంది, అకౌంటెంట్ కృష్ణ ,మహిళలు తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారిని దర్శించుకున్న వైసీపీ జిల్లా అధ్యక్షుడు

విశాలాంధ్ర-చెన్నూరు : చెన్నూరులోని శ్రీ రామలింగ చౌడేశ్వరిదేవి ఆలయం నందు వెలసిన అమ్మవారిని శనివారం కడప జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పోచంరెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి దర్శించుకున్నారు. ఆలయ సిబ్బంది ఆయనకు ఘనస్వాగతం పలికారు. అనంతరం దుశ్శాలువతో సత్కరించి పూలమాలలతో ఘనసత్కారం చేశారు. ఆయన వెంట మండల కన్వీనర్ జీఎన్ భాస్కర్‌రెడ్డి, ఎంపీపీ చీర్ల సురేష్‌యాదవ్, కొండపేట సర్పంచ్ చంద్రాయాదవ్, ఎంపీటీసీ నాగిరెడ్డి, నియోజకవర్గ విద్యార్థివిభాగం అధ్యక్షుడు గుమ్మళ్ల సాయికుమార్ రెడ్డి, ఆరవేటి శ్రీనివాసరాజు, అల్లి శ్రీరామమూర్తి, మండల యూత్ ఉపాధ్యక్షుడు కార్తీక్ రెడ్డి, మండల ప్రచార కమిటీ అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, హరి, యువ నాయకుడు పండుబాయ్, ద్వారకనాథరెడ్డి, మాజీ ఎంపీటీసీ భాస్కర్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, వైసీపీ అభిమానులు పాల్గొన్నారు.

స్వస్త్ నారీ సశక్తి పరివార్ కార్యక్రమం

విశాలాంధ్ర- సిద్ధవటం : మండలం పొన్నవోలు కొత్తపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్వస్థ నారి సశక్తి పరివార్ కార్యక్రమాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నాగరాజు ఎన్సిడి/ఆర్ బి ఎస్ కే నోడల్ ఆఫీసర్ డాక్టర్ జె ప్రవీణ్ కుమార్ పొన్నవోలుకొత్తపల్లి ప్రాథ మిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారిణి పి రంగలక్ష్మి రిబ్బన్ కటింగ్ చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో గర్భవతులకు పౌష్టికాహారం గురించి మరియు వారు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి గర్భవతులకు వివరించారు. సిద్ధవటం సబ్ యూనిట్ ఆఫీసర్ ఇండ్ల సుబ్బరాయుడు అక్కడి ప్రజలకు మలేరియా డెంగ్యూ చికెన్ గున్యా లాంటి జ్వరాలు ఎలా వస్తాయో అవి రాకుండా జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో మానసిక వ్యాధి వైద్య నిపుణులు పి సందీప్, ప్రసూతి వైద్యురాలు హర్షిత, కంటి వైద్య నిపుణులు కల్పనా, చిన్న పిల్లల వైద్యనిపుణులు మంజుల, జనరల్ మెడిసిన్ సూర్య ప్రకాష్ ఆప్తమాలజిస్ట్ యూనిస్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ లక్ష్మీనరసమ్మ, హెల్త్ సూపర్వైజర్ లక్ష్మీదేవి, మౌలాలి, ప్రాథమిక ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్‌పై అవగాహన

విశాలాంధ్ర - ఖాజీపేట : మండల కేంద్రమైన ఎంపీడీఓ ఆఫీస్ నందు శని వారం ఉదయం సూపర్ జి ఎస్ టీ, సూపర్ సేవింగ్స్ అనే అవేర్నెస్ ప్రోగ్రామ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతి థిగా ఖాజీపేట పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ వంశీధర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళలను ఉద్దేశించి సీఐ వంశీధర్ మాట్లాడుతూ సైబర్ క్రైమ్, మహిళ ల పైన జరిగే నేరాలు, ట్రాఫిక్ అవేర్నెస్, చైన్ స్నాచింగ్స్, వంటి నేరాలుపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డిఈ ఎల్‌డిఓ మైథిలి, ఎంపీడీఓ దివిజ సంపతి, ఏపీఎం శైలజ, ఎం ఎస్ ఈ సిలు, ఓ బి సభ్యులు, సీసీ లు, వివో ఏలు, మహిళ పోలీసులు పాల్గొన్నారు.

తోట సుధాకర్ ప్రసాద్‌కి ఏపీఎన్‌జీవోలు ఘన నివాళి

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : కీ.శే. కామ్రేడ్ తోట సుధాకర్ ప్రసాద్, మాజీ ఉమ్మడి రాష్ట్ర ప్రధా న కార్దర్శి 24వ వర్ధంతిని పురస్కరించుకొని కడప ఏ.పి.ఎన్జిజివో హోంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు బి.శ్రీనివాసులు, రాష్ట్ర ఉపాధ్యక్షులు వై.ప్రసాద్ యాదవ్, జిల్లా కార్యదర్శి నిత్య పూజయ్య ఆద్వర్యంలో కామ్రేడ్ తోట సుధాకర్ ప్రసాద్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఏపీ ఎన్ జి వో రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తూ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక మరియు విశ్రాంత ఉద్యోగుల శ్రేయస్సు కొరకు వారికి రావలసిన న్యాయ పరమైన రాయితీల కొరకు అలుపెరగని పోరాటం చేశారని పోరాటం మధ్యలోనే ప్రమాదంలో అశువులుబాసిన కామ్రేడ్ తోట సుధాకర్ ప్రసాద్ అకాల మరణం చాల బాధాకరమని అన్నారు. వారి ఆశయాలను ఏపీఎన్‌జి వో అసోసియేషన్ మరియు ఏపీ జేఏసీ ఎప్పుడు ముందుకు తీసుకు వెళ్తూ వారి ఉద్యమ స్ఫూర్తిని కొనసాగిస్తుందన్నారు. జిల్లా కోశాధికారి టీ శ్రేనివాసులు,సిద్దయ్య రాజశేఖర్, పద్మనాబారావు, హీరోమియా, సీటీ అధ్యక్షులు చిన్నయ్య,సీటీ నాగార్జున,కృష్ణకుమారి,లక్ష్మి, బాదుల్లా ఉద్యోగులు నాలుగో తరగతి జిల్లా నాయకులు కాటమయ్య, జానకి పాల్గొన్నారు.

పర్యాటక రంగాన్ని ప్రోత్సహించాలి: డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి

విశాలాంధ్ర-వేంపల్లి: పర్యాటక రంగం ప్రధానమైన రంగమని, ఈ రంగాన్ని కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు మరింత ప్రోత్సహించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని రాజ్యసభ మాజీ సభ్యులు డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి అన్నారు. ప్రపంచ పర్యాటక దినం సందర్భంగా ప్రముఖ పుణ్యక్షేత్రం, పర్యాటక కేంద్రం అయిన కడప జిల్లాలోని గండి క్షేత్రాన్ని కాంగ్రెస్ నాయకులు శనివారం సందర్శించారు. ఈసందర్భంగా తులసి రెడ్డి మాట్లాడుతూ పర్యాటకంపై అవగాహన కల్పించేందుకు ఐక్యరాజ్యసమితి ప్రతి ఏటా సెప్టెంబర్ 27ను ప్రపంచ పర్యాటక దినంగా 1980లో ప్రకటించింది అన్నారు. సామాజిక, రాజకీయ,కడప జిల్లాలో గండికోట,సిద్దవటం కోట, గండి,ఒంటిమిట్ట కోదండరామస్వామి దేవాలయం,అమీన్ పీర్ దర్గా, దేవుని కడప దేవాలయం, బ్రహ్మంగారిమఠం, సంగమేశ్వర దేవస్థానం, లంకమల్ల అభయారణ్యం, పుష్పగిరి ఇలా ఎన్నో పర్యాటక కేంద్రాలు ఉన్నాయన్నారు. వీటికి తగిన ప్రచారం ,వసతులు ప్రభుత్వం కల్పించాలన్నారు. పులివెందుల నియోజక వర్గంలో ఉన్న గండి శ్రీ వీరాంజనేయ స్వామి దేవాలయం అతి పురాతన ఆలయం అని, పవిత్ర పాపాగ్ని నది తీరాన, శేషాచల కొండల మధ్య ప్రకృతి అందచందాలతో ఉంటుందన్నారు. ప్రతి పర్యాటక ప్రేమికుడు సందర్శించాల్సిన ప్రదేశం అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అమర్నాథ్ రెడ్డి , ఉత్తన్న, బండారు వెంకటేశు ,చిన్నకోట్ల నాగరాజు, భాషా తదితరులు పాల్గొన్నారు

రైతు సేవాకేంద్రాల వారిగా లక్ష్యాలను పూర్తి చేయాలి: వెంకటేశ్వరరెడ్డి

విశాలాంధ్ర-పులివెందుల: డ్రిప్పునకు సంబంధించి రైతు సేవా కేంద్రాల వారీగా ఇచ్చిన లక్ష్యాలను పూర్తి చేయాలని ఏపీఎమ్ ఓఐపి పీడీ వెంకటేశ్వర్‌రెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఉద్యాన శాఖ, ఆంధ్రప్రదేశ్ సూక్ష్మ నీటి సాగు పథకం వారి ఆధ్వర్యంలో పులివెందుల లింగాల వేముల మండలాలలో పనిచేస్తున్నటువంటి రైతు సేవా కేంద్రం సిబ్బందికి ఉద్యాన శాఖ ప్రగతి పైన, అలాగే ఈ పంట నమోదు పైన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 5 ఎకరాల లోపు ఉన్న ఎస్సీ, ఎస్టీ రైతు సోదరులకు 100శాతం రాయితీతో 2 లక్షల 18 వేల వరకు అలాగే చిన్న, సన్నకారు రైతులకు 90శాతం సబ్సిడీతో రెండు లక్షల 18 వేల వరకు రాయితీ అందిస్తామన్నారు. ఐదు ఎకరాల నుండి 10 ఎకరాలు లోపు ఉన్న రైతు సోదరులకు 90శాతం సబ్సిడీతో రూ.3, 46,000లు వరకు, పది ఎకరాల పైన ఉన్న రైతు సోదరులకు 50 శాతం రాయితీతో నాలుగు లక్షల వరకు సబ్సిడీ అందిస్తామన్నారు. జిల్లా ఉద్యాన అధికారి సతీష్ మాట్లాడుతూ ఉద్యాన శాఖలో కొత్తగా ఉద్యాన పంటలు నాటుకునే రైతు సోదరులకు దానిమ్మ సీతాఫలం, డ్రాగన్ ఫ్రూట్, నేరేడు వంటి పంటలకు రైతు లకు రాయితీ ఇస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎంఐపీ ఎమ్ఐ ఇంజనీర్ శ్రీనివాసులు, పులివెందుల ఉద్యాన అధికారి రాఘవేంద్ర రెడ్డి, రైతు సేవ కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

సూపర్ జిఎస్‌టి-సూపర్ సేవింగ్స్‌పై అవగాహన

విశాలాంధ్ర-కలికిరి : సూపర్ జిఎస్‌టి -సూపర్ సేవింగ్స్ పథకం పై అవగాహన, చైతన్యం కలిగి ఆర్థికంగా డబ్బు ఆదా చేసుకుని ఆరోగ్యాంగా ఉండామని డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ మహమ్మద్ రఫీ పిలుపునిచ్చారు. శనివారం కలికిరిలోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లో స్వస్థ నారీసశక్తపరివార్ నిర్వహించారు.మహిళలకు జిఎస్‌టి. 2.0 వలన కలుగు ఆర్థిక ప్రయోజనం, కాన్సర్స్, జీవనసైలీలో మార్పులు, టి.బి వ్యాధి, కిలకారి ఫోన్ కాల్స్‌పై అవగాహన కల్పించి కర పత్రాలు పంపిణీ చేశారు. సిహెచ్ఓ శాంతకుమారి, పర్యవేక్షకులు గిరిజమ్మ, సుధాకర్, పావని, నాగవేణి, ఏఎన్ఎమ్‌లు మాదవి, రెడ్డీబి,మగ ఆరోగ్య కార్యకర్తలు షఫీవుల్లా, జగన్మోహన్ అంగన్వాడీ టీచర్స్ అమ్మాజీ, ప్రసన్న, రెడ్డిరాని, తిరుమల, ధనలక్ష్మి, రెడ్డెమ్మ, అరుణ, పుష్ప తదితరులు పాల్గొన్నారు.

వ్యాపారాభివృద్ధికి ఆకాంక్ష..వైస్ చైర్మన్ జగదీశ్వర్ రెడ్డి

విశాలాంధ్ర -ఎర్రగుంట్ల : యమహా ద్విచక్ర వాహన షోరూమ్‌ను ప్రారంభించారు. ఈకార్యక్రమంలో ఎర్రగుంట్ల వ్యవసాయ మార్కెట్ యార్డ్ కమిటీ వైస్ చైర్మన్ ఎస్.జగదీశ్వర్ రెడ్డి మాట్లాడుతూ షోరూం నిర్వాహకులు ఈ వ్యాపార రంగంలో దినదినాభివృద్ధి సాధించి అత్యున్నత స్థితికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా షోరూం నిర్వాహకులు జగదీష్‌కు పుష్పగుచ్ఛం అందజేసి సాదర స్వాగతం పలికారు. యమహా ద్విచక్ర వాహనాలను ఆసక్తిగా తిలకించిన జగదీష్ వాహన కొనుగోలు దారులు ఆకర్షించే విధంగా నాణ్యత ప్రమాణాలు నిబంధనల మేరకు పాటించారని కొనియాడారు. వాహనాలు వివిధ రంగులలో లభ్యమవుతుండడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో జగదీష్ మిత్రబృందం పాల్గొంది.

ఎన్నికల సంఘం వ్యవహార శైలి మార్చుకోవాలి :కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎన్.డి విజయ జ్యోతి

విశాలాంధ్ర-పోరుమామిళ్ల రూరల్ : బీజేపీతో కుమ్మక్కై ఓట్లు దొంగతనానికి పాల్పడిన కేంద్ర ఎన్నికల సంఘం వ్యవహార శైలి మార్చుకోవాలని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు ఎన్.డీ. విజయ జ్యోతి డిమాండ్ చేశారు. లక్ష సంతకాల సేకరణ లో భాగంగా శనివారం పోరుమామిళ్లలో కాంగ్రెస్ పోరుమామిళ్ల మండల అధ్యక్షులు అన్వర్ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షురాలు ఎన్.డీ. విజయ జ్యోతి. పిసిసి సభ్యులు అన్వర్‌లు మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల సంఘం ఓటర్ల జాబితాలో అవకతవకలు సృష్టించి భారతీయ జనతా పార్టీతో కుమ్మక్కై అనేక రకాలుగా ఓట్ల చోరీకి పాల్పడుతుందని వారు హెచ్చరించారు. అంతేకాకుండా లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ వేసిన ప్రశ్నలకు ఎన్నికల సంఘం దగ్గర ఎలాంటి సమాధానం లేదని, ఎన్నికల సంఘానికి ప్రశ్నలు వేస్తుంటే బీజేపీ ఉలిక్కిపడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఇలాంటి పరిణామాలన్నీ బీజేపీకి ఎన్నికల సంఘానికి ఉన్న దోస్తీని తేటతెల్లం చేశాయన్నారు. కాబట్టి దేశాన్ని పరిపాలించే హక్కు కోల్పోయిందని బిజెపి పాలనకు ఇక నూకలు చెల్లాయని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతేకాకుండా మీడియా సమావేశంలో విలేకరులు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు విజయ జ్యోతిని పోరుమామిళ్ల లో జరుగుతున్న రోడ్డు గురించి ఎందుకు మేడం రోడ్డుకు అనుమతి వచ్చినప్పుడు 90 అడుగుల వెడల్పు అన్నారు రోడ్డుపై స్పందించి రోడ్డు పనులు మొదలుపెట్టారు. సంతకాల సేకరణ కార్యక్రమంలో బద్వేల్ నియోజకవర్గం నాయకులు పుల్లూరు భాష, బి.కోడూరు మండల పార్టీ అధ్యక్షుడు గుర్రప్ప, కాశినాయన మండల అధ్యక్షుడు పుల్లూరు పెద్ద ఖాజావల్లి, బండి బాలసుబ్బయ్య, బుడిగి శ్రీనివాసులు, కార్యకర్తలు నాగరాజు, సోహెల్, ముజ్జు, సమీర్,రిజ్వాన్, నాయబ్ రసూల్ తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్ కార్డుతో త్వరగా రేషన్ సరుకులు

విశాలాంధ్ర-పులివెందుల:స్మార్ట్ కార్డుల ద్వారా త్వరితగతిన రేషన్ సరుకులను పొందవచ్చని టిడిపి పట్టణ మాజీ అధ్యక్షుడు మద్దూరు వెంకటరామిరెడ్డి అన్నారు. వెలమవారిపల్లిలో శనివారం స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా పంపిణీ వ్యవస్థలో అక్రమాలను అరికట్టేందుకు స్మార్ట్ కార్డులను ప్రభుత్వం అందజేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో చిన్నయ్య, మున్సిపల్ కౌన్సిలర్ రంగనాయకులు, సహదేవరెడ్డి, పుల్లయ్య, రోశన్ నాయుడు, నారాయణ, భార్గవ, పుష్పగిరి స్కూల్ ఓబుల్ రెడ్డి, పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని వెలమవారిపల్లి గ్రామ ప్రజలు ,తదితర కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రూ.1,14,815 ఆర్థిక సహాయం

విశాలాంధ్ర - సుండుపల్లె : మండలంలోని దిన్నెమీద బలిజపల్లికు చెందిన బోనంసెట్టి నాగరాజ కుమారుడు అనారోగ్యంతో ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న నాగ చైతన్య 14 సంవత్సరాలు బోన్ బ్లడ్ క్యాన్సర్‌తో ఏలూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడని కుటుంబ సభ్యులు పెద్దబలిజపల్లి సేవా సంఘం అధ్యక్షులు, నంద్యాల నాగరాజు, రూ.1,14,815 ఆర్థిక సహాయం అందజేశారు. సేవా సంఘం కమిటీ సభ్యులతో పాటు కోడూరు బొప్పాయి రైతులు,రెడ్ బుల్ కంపెనీ పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ పర్యాటక దినోత్సవం

విశాలాంధ్ర -ఎర్రగుంట్ల : ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం గండికోటలో ప్రభుత్వ ఐటిఐ కళాశాల విద్యార్థులు స్వచ్ఛత కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమని జిల్లా పర్యాటక శాఖ అధికారి సురేష్ కుమార్ పేర్కొన్నారు. థీమ్ టూరిజం, ట్రాన్స్ఫర్మేషన్ అనే నినాదంతో ఇక్కడ ఈ వేడుకలను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. తొలుత విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సురేష్ కుమార్ మాట్లా డుతూ గండికోట పర్యాటక యాత్రికులకు అవసరమైన అన్ని రకాల సౌకర్యాలను కల్పించడం జరుగుతోందన్నారు. గ్రాండ్ కెనాల్ ఆఫ్ ఇండియాగా పిలువబడుతున్న గండికోట ప్రాముఖ్యతను మరింత ప్రచారంలోకి తేవాల్సి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డివియం డివిజనల్ మేనేజర్ మల్లికార్జున గౌడ్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

జిఎస్‌టి 2.0 ప్రయోజనాలపై ప్రచారం

విశాలాంధ్ర- ఎర్రగుంట్ల : జిఎస్‌టి పన్నుల విధానంలో మార్పులు తెచ్చి తాజాగా అమలుకు శ్రీకారం చుట్టిన నేపథ్యంలో చేకూరు ప్రయోజనాలపై విస్తృతంగా ప్రచారం చేయాలని, మాదకద్రవ్యాలు- మత్తు పదార్థాల వినియోగంతో కలుగు దుష్పరిణామాలపై ప్రజలకు వివరించాలని ఎంపీడీవో వెంకటరమణయ్య, సర్కిల్ ఇన్స్పెక్టర్ విశ్వనాథరెడ్డి సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సభా భవనంలో శనివారం ఆయా అంశాలపై సమావేశం జరిగింది. కార్యక్రమంలో ఏపీఓ జగదీశ్వరి, డ్వాక్రా సంఘాల మహిళలు పాల్గొన్నారు.

ప్రభుత్వ ప్రోత్సాహకాలను సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర-ముద్దనూరు : ప్రతి మహిళ వ్యాపారవేత్తగా, పారిశ్రామిక వేత్తగా ఎదిగేలా రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహం, రక్షణలను మహిళలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడీఓ రాధా కృష్ణవేణి కోరారు. శనివారం సిఐ దస్తగిరి, ఏపిఎం అపర్ణ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్, మహిళల భద్రత,మత్తు పదార్థాల గురించి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలో మహిళలు కీలక భూమిక వహిస్తారన్నారు. సూపర్ జీఎస్టీ అమలు వల్ల నిత్యావసర వస్తువుల ధరలు తగ్గాయని ,పేద,మధ్యతరగతివర్గాలవారికీ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు.ఈ కార్యక్రమంలో జిఎస్టి అసిస్టెంట్ కమిషనర్ బాబుల రెడ్డి, మహిళలు పాల్గొన్నారు.

సిల్వర్ కాయిన్ అందించిన బేపారి మహమ్మద్ ఖాన్

విశాలాంధ్ర-రాయచోటి:స్థానికట్రంక్ రోడ్డు దగ్గర బషీర్ ఖాన్ హెచ్ పి పెట్రోల్ బంక్ లో దసరా, దీపావళి సందర్భంగా వాహన దారులకు బంపర్ ఆఫర్ నిర్వహించారు. కంపెనీ నిబంధనలు అనుసరించి పెట్రోల్ పట్టించుకొన్న వాహనదారులకు లక్కీ డ్రా విధానాన్ని ఏర్పాటు చేశారు. లక్కీ డ్రాలో గెలుపొందిన ద్విచక్ర వాహనదారులకు ప్రతిరోజు 5 గ్రాముల సిల్వర్ కాయిన్, ఫోర్ వీలర్ ద్విచక్ర వాహనాలకు వారానికి ఒకసారి 10 గ్రాముల వెండి నాణెంను అందజేస్తున్నారు. ఈ ఆఫర్ దసరా దీపావళి వరకు మాత్రమేనని, అయితే వాహనదారులు అక్కడ ఏర్పాటు చేసిన సూచిక బోర్డు నిబంధనలు తప్పని సరిగా పాటించే వారు మాత్రమే అర్హులని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బేపారి మహమ్మద్ ఖాన్ వారితో పాటు వారి సోదరులు బేపారు జాబివుల్లా ఖాన్, అసద్ ఖాన్ పెట్రోల్ బంక్ సిబ్బంది పాల్గొన్నారు.

సూపర్ జీఎస్టీ,సేవింగ్స్ పై అవగాహన

విశాలాంధ్ర-పెద్దతిప్పసముద్రం: సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ పై ప్రజలు పూర్తి స్థాయిలో అవగాహన పెంచుకోవాలని తాసిల్దార్ శ్రీరాములు నాయక్ అన్నాడు. శనివారం పిటియం సచివాలయంలో సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మారిన ధరల విషయంపై తెలియజేయాలన్నాడు. ఈ కార్య క్రమంలో కార్యదర్శులు కృష్ణ ప్రసాద్ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జీఎస్టీపై ప్రజలకు అవగాహన

విశాలాంధ్ర - వల్లూరు : జీఎస్టీపై ప్రజలకు అవగాహన తప్పనిసరిగా కల్పించాలని వల్లూరు ఎంపీడీవో రఘురాం పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో వివోఏ సిబ్బందికి సూపర్ సేవింగ్స్ మహిళ భద్రత మత్తుపదార్థాల వినియోగంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈసందర్భంగాఎంపీడీవో మాట్లాడుతూ జీఎస్టీ సవరణలతో నిత్యావసర సరుకులు, గృహ ఉపకరణాలు, ఔషధాలు, విద్య, స్టేషనరీ ఉత్పత్తులు, వస్త్రాలు, క్రీడా వస్తువులు, రవాణా, హెూటల్, వ్యవసాయ ఉపకరణాల ధరలు గణనీయంగా తగ్గుతాయన్నారు. వీటిపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు వెలుగు సిబ్బంది అందరూ కృషి చేయాలి అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం యామిని పూర్ణిమ,హెడ్ కానిస్టేబుల్ కేఎంఎస్ రాజు,సీసీలు వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

కుక్కల దాడిలో మేకపిల్లలు మృత్యువాత

ప్రభుత్వం ఆదుకోవాలంటున్న బాధితుడు

విశాలాంధ్ర,-బ్రహ్మంగారిమఠం : మండల పరిధిలోని పలుగు రోళ్లపల్లె పంచాయతీలో ఉన్న జోకుపల్లె ఎస్సీ కాలనీకి చెందిన జాలా ప్రసాద్ మేకల పెంపకంతో జీవనం గడిపే వాడు. శుక్రవారం రాత్రి తను భార్య జాలా జ్యోతి ప్రసాద్ మేకలు మేపుకొని తిరిగి ఇంటికి రావడంతో రాత్రి సమయంలో ప్రసాదు ఇంటి వద్దనే మేకల దొడ్డిలో వేశారు.అయితే ప్రసాద్ జ్వరంతో బాధపడుతున్న ఇంటిలో పడుకోవడంతో అర్ధరాత్రి సమయంలోనే కుక్కలు మేకల దొడ్డి పై దాడి చేసి మేక పిల్లలను కొరికి చంపి వేశాయి. సుమారు 34 మేక పిల్లలకు చంపేశాయన్నారు. భారీగా నష్టం జరిగిందని తన జీవన ఉపాధి కోల్పోయామని ప్రభుత్వం ఆదుకోవాలని నష్టపరిహారం వచ్చే విధంగా చూడాలని తను ఆశిస్తున్నామన్నారు. అదేవిధంగా గ్రామాలలో తిరుగుతున్న కుక్కలను ఊరు బయటకు తరలించే విధంగా చూడాలని కోరారు. కుక్కల వల్ల ప్రజలు చిన్నారులు ఇబ్బంది కలుగుతున్నాయని తెలిపారు. చిన్నపిల్లల పైన దాడి చేస్తూ గాయాలు పాలు చేస్తున్నాయని వాపోయారు. వృద్ధులను సైతం దాడి చేస్తున్నాయని తెలిపారు. వాహనదారులను కూడా వెంటపడి గ్రామాలలో ఇబ్బంది పెడుతున్నాయని పేర్కొన్నారు. అధికారులు కుక్కలపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు, ప్రజలు కోరుతున్నారు.

గజలక్ష్మిదేవి అలంకారంలో దర్గా మాతాజీ

విశాలాంధ్ర- రామాపురం : మండలంలోని నీలకంఠరావుపేట పంచాయతీలోని శ్రీ దర్బారు సాయి నగర్లో వెలసిన సమర్థ సద్గురు దర్గా మాతాజీ శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా 6వ రోజు శనివారం గజలక్ష్మి దేవి అలంకారములో శ్రీ దుర్గా మాతాజీ ప్రజలకు దర్శనమిచ్చింది. ఉదయం మహాగణపతి పూజ. గంగా పూజ మృత్తిక పూజ. నవగ్రహ పూజ. కలిశ స్థాపన. సద్గురు దర్గా స్వామీజీ. సద్గురు దర్గా మాతాజీకి అభిషేకాలు అలంకరములు మహా మంగళహారతితో ముగించారు. ఈ ఉత్సవాలకు వచ్చిన భక్తులు అందరికీ అన్నదానం నిర్వహించారు.

మాదకద్రవ్యాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలి : సీఐ కృష్ణారెడ్డి

విశాలాంధ్ర-చెన్నూరు : సమాజంలో రోజు రోజుకు యువత చెడుదారి పడుతోందని వారిలో మంచి ప్రవర్తన రావాలంటే ముఖ్యంగా కుటుంబ సభ్యులు మాదక ద్రవ్యాలపై అవగాహన కలిగి ఉండాలని స్థానిక సీఐ కృష్ణారెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలంలోని వెలుగు కార్యాలయం నందు సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ముఖ్యంగా మూడు అంశాలైన తగ్గిన జీఎస్టీ గురించి రెండవది ఉమెన్ హెరాస్మెంట్పై మూడవది మాదక ద్రవ్యాలపై చర్చించారు. ఇందులో ఎంపీడీవో కిరణ్మోహన్రావు, జీఎస్టీ అధికారులు, ఐసీడీఎస్ సూపర్వైజర్, ఏపీఎంలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీఎస్టీ గురించి ప్రజల్లో అవగాహన కల్పించాలని దేనిమీద ఎలా తగ్గిందో తెలపాలన్నారు. మాదకద్రవ్యాలు, మహిళల పట్ల చెడుగా ప్రవర్తించేవారిపై ఎలా రియాక్టు కావాలో అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో సురేష్బాబు, ఏపీఎం వెంకట రమణ, తదితర సిబ్బంది పాల్గొన్నారు.

బోరుమోటర్లు దొంగలించారా లేదా అధికారులే తీసుకెళ్లారా నిగ్గు తేల్చాలి

విశాలాంధ్ర- రాయచోటి రూరల్ : మాధవరం గ్రామం జగనన్న కాలనీలో రెండు బోర్ల మోటార్ పైపులు వైర్లు దొంగలించారా లేదా అదికారులే తిసేశారా అనేదానిపై. నిగ్గు తేల్చాలని. సిపిఐ ఎంఎల్ లిబరేషన్ అన్నమయ్య జిల్లా కార్యదర్శి మావులూరి విశ్వనాథ అన్నారు. శనివారం ఆయన జగనన్న కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. మాధవరం గ్రామం వెంకటాపురం వద్ద గత ప్రభుత్వంలో ఏర్పాటుచేసిన జగనన్న కాలనీలోమోలిక వసతులు లేవని ఆయన విమర్శించారు. ఆ నాటి ప్రభుత్వం రెండు బోర్లు వేసి మోటర్లు బిగించారు అన్నారు. అయితే ఈ రెండు బోర్ల మోటర్లు పైపులు, వైర్లు దొంగలించారా లేదా సంబంధించిన అధికారులు తీసుకెళ్లారా అనేదానిపై విచారణ చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు తాగునీటి వసతి కోసం ఏర్పాటుచేసిన రెండు బోర్లు ల్లో పుష్కలంగా వాటర్ ఉన్నప్పటికీ ఉన్న రెండు బోర్లు మోటర్లు పైపులు కేబుల్ వైర్లు లేకపోవడం వలన బాధితులు ఇల్లు కట్టుకోవడానికి ఇబ్బంది పడుతూ సగానికి పైగా పునాదులు నిర్మించి వదిలేశారు అన్నారు. కొంతమంది ఇండ్లు పూర్తి చేసుకొని నివాసం ఉండడానికి వసతులు లేవని ప్రధానంగా నీటి సమస్య ఉందని నివాసం ఉండ లేదన్నారు వెంటనే జగనన్న కాలనీకి ఏర్పాటుచేసిన రెండు బోర్లు మోటర్లు పైపులు బిగించి నీటి సమస్య పరిష్కరించాలని ఆయన కోరారు ఈ కార్యక్రమంలో సిపిఐ (ఎంఎల్ లిబరేషన్). నాయకులు రమణ వెంకట చలపతి పాల్గొన్నారు.

ఎంబీఏ డిగ్రీ భవిష్యత్కు మార్గదర్శకం

విశాలాంధ్ర-రాయచోటి: ప్రస్తుత సమాజంలో ఎంబీఏ విద్య అనేది కేవలం ఒక డిగ్రీ కాదు అది భవిష్యత్తుకు మార్గదర్శకం అవుతుందని రిసోర్స్ పర్సన్ డాక్టర్ మహేష్ పవన్ అన్నారు. శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం మొదటి సంవత్సరం ఎంబీఏ విద్యార్థుల కెరియర్ గైడెన్స్ కోసం ప్రత్యేక ఇండక్షన్ ప్రోగ్రాంను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య రిసోర్స్ పర్సన్ గా డాక్టర్.మహేష్ పవన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మేనేజ్మెంట్ కోర్సు ద్వారా లీడర్షిప్, సమస్యల పరిష్కారం, వ్యాపార అవగాహన, టీమ్ వర్క్ వంటి నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలి. భవిష్యత్తు కెరీర్లో విజయానికి ఇవి కీలకం అని పేర్కొన్నారు. కళాశాల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎం.సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ ఈ ఇండక్షన్ ప్రోగ్రాం లక్ష్యం విద్యార్థులలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడం, వారిని కోర్సు నిర్మాణం, అకడమిక్ షెడ్యూల్, ఇంట ర్న్షిప్స్, పరిశ్రమ అవకా శాలపై అవగాహన కల్పించడం. విద్యార్థులు క్లాస్రూమ్ లెర్నిం గ్తో పాటు ప్రాక్టికల్ అనుభవం పొందాలని సూచించారు. ఎంబీఏ విభాగా ధిపతి కె.ఇంతియాజ్ మాట్లాడుతూ నేటి మేనేజ్మెంట్ విద్యార్థులు కేవలం పుస్తకాల చదువుతో ఆగిపోకుండా, కమ్యూనికేషన్ స్కిల్స్, లీడర్షిప్ క్వాలిటీస్, డిజిటల్ టూల్స్ వాడకం, ఆంత్రప్రెన్యూర్షిప్ నైపుణ్యాలు పెంపొందించుకోవాలి. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ ను కళాశాల యాజమాన్యం ఘనంగా సన్మానించి జ్ఞాపికను బహుకరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి.బాలాజీ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వి.వెంకటరమణ, అధ్యాపకులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

ఆరోగ్య కేంద్రాల్లోనే వైద్య సేవలు పొందాలి

విశాలాంధ్ర-కడప : కడప నగరంలోని రామంజనేయపురం ప్రాంతంలో ఉన్న వీరభద్ర ప్రాథమిక వైద్య చికిత్స క్లినిక్ పై శనివారం కడప అర్బన్ నోడల్ ఆఫీసర్ డా.ఎం.డి. ఉబేదుల్లా ప్రత్యేక తనిఖీ నిర్వహిం చారు.ఈ తనిఖీ సందర్భంగా గుర్తింపు లేకుండా కార్యకలాపాలు నిర్వహిస్తూ, ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు లేని విధంగా వైద్య సేవలు అందిస్తున్నట్లు గుర్తించారు. తనిఖీ సమయంలో క్లినిక్లో ఉన్న ఇంజెక్షన్లు, నిబంధనలకు విరుద్ధంగా ఉన్న ఔషధాలు మరియు వైద్య పరికరాలను సవివరంగా పరిశీలించారు. అనుమతులు లేకుండా కార్యకలాపాలు నిర్వహించినందుకు సంబంధిత క్లినిక్ను సీజ్ చేశారు. అదేవిధంగా, సంబంధిత వ్యక్తిపై తగిన చర్యలు తీసుకోవడానికి ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించారు.ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ మహబూబ్ బాషా పాల్గొన్నారు.ప్రజలు ఇలాంటి అనధికారిక ప్రైవేట్ క్లినిక్లలో చికిత్స పొందకుండా జాగ్రత్త వహించి, ప్రభుత్వం గుర్తించిన ఆరోగ్య కేంద్రాలలోనే వైద్య సేవలు పొందాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ విజ్ఞప్తి చేసింది.

సిసి రోడ్లకు భూమి పూజ ..మన్యం బ్రదర్స్ ఆధ్వర్యంలో అభివృద్ధి పనులు

విశాలాంధ్ర- బ్రహ్మంగారిమఠం : మండల పరిధిలోని డి నేలటూరు ఎస్సీ కాలనీలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిన మన్యం బ్రదర్స్ ఆధ్వర్యంలో సిసి రోడ్లను పనులను ప్రారంభించిన తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు, చెన్నుపల్లి సుబ్బారెడ్డి చేతుల మీదగా టెంకాయ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామంలో సుమారు 30సంవత్సరాలు పైగా గ్రామానికి కొన్ని రోడ్లు లేకపోవడంతో కూటమి ప్రభుత్వం ద్వారా మైదుకూరు శాసనసభ్యులు పుట్టా సుధాకర్ యాదవ్ ఆదేశాలతో గ్రామాల్లో అభివృద్ధికి ముందడుగు పడుతున్నాయి. అందులో భాగంగానే నేలటూరు పంచాయతీలో మన్యం బ్రదర్స్, ఆధ్వర్యంలో నాగేశ్వర్ రెడ్డి,రవిశంకర్ రెడ్డి సిసి రోడ్లను పనులను చేపట్టారు. గ్రామానికి సుమారు రూ.5 లక్షలతో రోడ్డు నిర్మాణానికి నిధులు కేటాయించారని వారు పేర్కొన్నారు. కాలనీవాసులు ఎమ్మెల్యే కు ప్రత్యేక అభినందనలు కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పూజాశివ యాదవ్, సుధాకర్ యాదవ్ సన్నపూరి, శీను, పంచాయతీరాజ్ శాఖ అసిస్టెంట్ ఇంజనీర్, మనోజ్ కుమార్, సచివాలయం సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.

భార్యపై హత్యాయత్నం చేసిన భర్త అరెస్ట్

విశాలాంధ్ర- మదనపల్లె :భార్యపై సల.. సలా.. కాలే సాంబారు పోసి హత్యాయత్నానికి పాల్పడిన భర్తను శనివారం రెండో పట్టణ పోలీసులు అరెస్ట్ చేశారు. స్థానిక కురవంకకు చెందిన రామాంజులు భార్య భారతి ప్రభుత్వ ఆసుపత్రిలో డైట్ కాంట్రాక్టర్ ఉన్న వీరభద్ర వద్ద పనిచేస్తోంది. కాగా ఈనెల 24న సాయంత్రం భారతి(25) స్థానిక జిల్లా ఆస్పత్రి వద్ద రోగులకు అన్నం వడ్డించేందుకు అన్నీ సిద్ధం చేసుకుంటుండగా రామాంజులు అక్కడికి వెళ్లాడు. భార్యతో గొడవ పెట్టుకుని, ఆవేశంతో కాలుతున్న సాంబారు భార్యపై పోసేశాడు. తీవ్రంగా గాయపడిన బాధితురాలిని స్థానికులు ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసిన పోలీసులు నిందితున్ని అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించారు.

లలితాదేవి అలంకరణలో శ్రీ కన్యకా పరమేశ్వరి

విశాలాంధ్ర-సుండుపల్లె : మండల కేంద్రంలోని వైశ్యాబజారులో దసరా ఉత్సవాలలో ఆరవ రోజు లలితాదేవిగా కన్యకా పరమేశ్వరి అత్యంత వైభవంగా పూజలు అందుకున్నారు. భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

మీనాక్షి దేవి అలంకారంలో కన్యకాంబ

విశాలాంధ్ర -నందలూరు : శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా 6 వరోజు శనివారం మీనాక్షి దేవి అలంకారంలో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవి భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం పురోహితులు బండాత్మకూర్ శివకుమార్ శర్మ, ఆధ్వర్యంలో పంచామృతాభిషేకం, చండీ పారాయణం నిర్వహించారు. బెల్లంకొండ హరీష్ కుటుంబ సభ్యులు వ్యవహరించారు. ఆలయ అధ్యక్ష, ఉపాధ్యక్షులు యంబలూరు నరసింహస్వామి, మాకం వెంకట కుమార్, చలపాటి నరసింహ శ్రేష్టి, సెక్రెటరీ గెలివి నాగ సురేంద్ర కుమార్ పాల్గొన్నారు.

సైబర్ నేరాలు, రోడ్డు సేఫ్టీ, డ్రగ్స్ అనర్థాలపై అవగాహన :ఎస్పి షెల్కే నచికేత్ విశ్వనాథ్

విశాలాంధ్ర-కడప : ప్రజల శ్రేయస్సుకు ఉపయోగపడే రీల్స్, పోస్టులు, కథనాలు, స్టేటస్ వీడియోలకు ప్రాధాన్యం ఇవ్వాలని జిల్లాఎస్.పి షెల్కే నచికేత్ విశ్వనాథ్ కోరారు. జిల్లాలో పోలీస్ సిటిజెన్ కో-ఆపరేషన్లో భాగంగా సైబర్ నేరాలు, రోడ్డు సేఫ్టీ, డ్రగ్స్ అనర్థాలపై ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లాలోని 50 మంది సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్స్ తో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ప్రజల జీవితాలతో చెలగాటం ఆడుతున్న సైబర్ నేరాలు...కుటుంబాలను చిన్నాభిన్నం చేస్తున్న

మాదక ద్రవ్యాలు, రోడ్డు ప్రమాదాల నియంత్రణకు ప్రజల్లో చైతన్యం తేవడమే ఈ సమావేశం ముఖ్య ఉద్దేశ్యమన్నారు. పోలీస్ శాఖ పరంగా పై అంశాలపై అలు పెరగని కృషి చేస్తూ చర్యలు తీసుకుంటామన్నారు. ఇదే సమయంలో సోషల్ మీడియా ద్వారా ప్రజల్లో అవగాహన తీసుకొస్తే బాగుంటుందని సంకల్పించామన్నారు. సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్లు తాము పెట్టే పోస్ట్ లలో సోషల్ మీడియా మార్గదర్శకాలు పాటిస్తూ పోస్ట్ చేయాలన్నారు.సోషల్ మీడియా ప్లాట్ ఫామ్స్లో మహిళలు, బాలికలపై, న్యాయ వ్యవస్థ, వ్యక్తిగత దూషణలను, కులాలు, మతాల మధ్య విద్వేషాలు రగిల్చేలా పోస్టులను గుర్తిస్తే వెంటనే ఫ్లాగ్ చేసి వెంటనే kadapapolicesocialmedia@gmail.com లేదా వాట్సాప్ నెంబర్ 9121100686 కు ఫిర్యాదు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్ లు, సైబర్ క్రైమ్, సోషల్ మీడియా ఇన్స్పెక్టర్ ఎ.మధు మల్లేశ్వర రెడ్డి, సైబర్ క్రైమ్ మరియు సోషల్ మీడియా సిబ్బంది పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

విశాలాంధ్ర-మదనపల్లె : కుటుంబ సమస్యలతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన శనివారం మదనపల్లె మండలంలో జరిగింది. కొండామర్రిపల్లి పంచాయతీ, తట్టివారిపల్లెకు చెందిన శేషయ్య కుమారుడు వి.నాగేంద్ర (37) కుటుంబ సమస్యలతో గొడవపడ్డాడు. దీంతో క్షణికావేశంలో ఇంట్లోనే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న తాలూకా పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. పంచనామా అనంతరం పోస్టు మార్టం కోసం స్థానిక జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు సుండుపల్లె విద్యార్థులు

విశాలాంధ్ర - సుండుపల్లె : సాఫ్ట్ బాల్ అసోషియేషన్ ఆధ్వర్యంలో అక్టోబర్, నవంబర్ మసాలలో నిర్వహించే సాఫ్ట్ బాల్ సబ్ జూనియర్స్,సీనియర్లకు రాష్ట్ర స్థాయిలో నిర్వహించే పోటీలకు సుండుపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు, పెద్ద మాదిగ పల్లెకు చెందిన క్రీడాకారులు ఎంపికయ్యారు. శనివారం పుల్లంపేటలో జరిగిన సబ్ జూనియర్స్, సీనియర్ మెన్ జిల్లా జట్ల ఎంపికలలో సబ్ జూనియర్స్ బాలుర విభాగంలో ఉన్నత పాఠశాల విద్యార్థులు అభి, బాలికల విభాగంలో సంధ్యలు తమ ప్రతిభను కనబరచి ఎంపికల రాష్ట్ర పరిశీలకుల దృష్టినాకర్షించారు. సీనియర్ మెన్ విభాగంలో ఆపాఠశాల పూర్వ విద్యార్థులు కార్తీక్, ఆంజనేయులు జిల్లా జట్టు

లో స్థానం దక్కించుకున్నారని పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ రాధారాణి తెలిపారు. సబ్ జూనియర్స్ రాష్ట్ర స్థాయి పోటీలు అక్టోబర్ 4, 5, 6 తేదీలలో శ్రీకాకులంలో, సీనియర్ మెన్ పోటీలు నవంబర్లో గుంటూరులో నిర్వహించనున్నట్లు సాఫ్ట్ బాల్ అసోషియేషన్ ప్రతినిధులు పుల్లంపేటలో ప్రకటించారు.

జగన్‌పై బాలకృష్ణ అనుచిత వ్యాఖ్యలు దారుణం :అమరనాథ్ రెడ్డి

విశాలాంధ్ర- పీలేరు : అసెంబ్లీలో మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డిపై అసెంబ్లీ సాక్షిగా బాలకృష్ణ దుర్భాషలాడటం యావత్ ఆంధ్రప్రదేశ్ కి సిగ్గుచేటని వైసిపి ప్రచార విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అమరనాథ్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలపై విద్వేషాలు ఉన్నంత మాత్రాన తన స్థాయి మరిచి బాలకృష్ణ హుందాగా వ్యవహరించకుండా ఇలా చౌకబారు వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. శాసనసభ సమావేశంలో ప్రతి ఒక్కరూ హుందాగా వ్యవహరించాలి కానీ సభలో లేని వ్యక్తి గురించి ఇలా మాట్లాడటం తగదన్నారు. ఇప్పటికైనా

బాలకృష్ణ తన తప్పు తెలుసుకొని తన వ్యాఖ్యలు వెనక్కి తీసుకొని క్షమాపణ చెబితే మంచిదన్నారు.

జిఎస్టి స్లాబులు వినియోగదారులకు అందాలి

విశాలాంధ్ర-రామసముద్రం : కేంద్ర ప్రభుత్వం వస్తువులపై తగ్గించిన జిఎస్టి స్లాబులు స్లాబులు వినియోగదారులకు అందాలని ఏసిటిఓ షేక్ రఫీ పేర్కొన్నారు శనివారం స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద జిఎస్టి స్లాబులపై వినియోగదారులకు తెలియజేశారు వ్యాపారులు ప్రభుత్వ ఆదేశానుసారం కచ్చితంగా ధరలు తగ్గించి అమ్మాలని వినియోగదారులు ధరలు చూసుకోవాలని తద్వారా కొనుగోలు శక్తి పెరుగుతుందని తెలిపారు జాయింట్ కమిషనర్ సునీత చిరంజీవి ఆదేశానుసారం వినియోగదారులకు వర్తక వ్యాపారులకు జీఎస్టీ పై పూర్తి సమాచారం అందిస్తున్నామని చెప్పారు కార్యక్రమంలో ఎంపీడీవో లతీఫ్ జడ్పిటిసి రామచంద్రారెడ్డి సిరాజ్ భాష చెంగారెడ్డి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలం దేవస్థానం బోర్డు చైర్మన్ రమేష్ నాయుడికి సన్మానం

విశాలాంధ్ర-గాలివీడు : శ్రీశైలం దేవస్థానం బోర్డు చైర్మన్గా నియమితులైన పోతుగుంట రమేష్ నాయు డిని బీజేపీ నాయకులు ఘనంగా సన్మానించారు. శనివారం రాయచోటిలోని ఓ ప్రవేటు కళాశాలలో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఆయ నకు దుశ్శాలువా, పూలమాలలతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు డా.పాలగిరి శ్రీనివాసులు రాజు, శివగంగిరెడ్డి, రేవనూరి రాజ్ కుమార్,ఎర్రనాగు భాస్కర్ రెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

మిట్స్ డీమ్డ్ టు బి యూనివర్సిటీలో దసరా వేడుకలు

విశాలాంధ్ర-మదనపల్లె: మిట్స్లో దసరా వేడుకలు ఎంతో ఉత్సాహంగా జరుపు కున్నారు. విద్యార్థులు తమ ప్రతిభను ఉత్సాహభరితమైన దాండియా నృత్య ప్రదర్శన చేశారు. విద్యార్థులు తమ సృజనాత్మకతను వ్యక్తీకరించడానికి, పండుగ స్ఫూర్తిని జరుపుకోవడానికి ఒక వేదికను అందించిందని యూనివర్సిటీ ఉపకులపతి డాక్టర్ సి. యువరాజ్ అన్నారు.ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థులలో స్నేహం, సృజనాత్మకత మరియు సాంస్కృతిక అవగాహనను పెంపొందిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ట్స్ అండ్ కల్చరల్ కో ఆర్డినేటర్ ప్రదీప్, సాక్ కో ఆర్డినేటర్ జి. రెడ్డి హేమంతా, నవీన్, షాయీజ్ అహమ్మద్లు పాల్గొన్నారు.

గిరిజన విద్య, జీవనోపాధి కోసం ప్రభుత్వం ముందడుగు వేయాలి

విధాలాంధ్ర - పీలేరు : ట్రైబల్ డెవలప్మెంట్ అధికారి కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ గిరిజన యానాది సేవా సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు జానం గంగిరెడ్డి, ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షులు కిల్లా విజయ్ కుమార్ కలిసి గిరిజన సమాజం ఎదుర్కొంటున్న సమస్యలను విపులంగా వివరించారు.జిల్లాలోని అతి దూరపు, మారుమూల ప్రాంతాల్లో నివసిస్తున్న గిరిజన గ్రామాల అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. గిరిజనులు తరతరాలుగా కొనసాగిస్తున్న కులవృత్తులు నిలబెట్టేందుకు సబ్సిడీతో కూడిన రుణాలు, ముడిసరుకుల కొనుగోలుకు తగిన ఆర్థిక సహాయం అందించడం అత్యంత అవసరమని సూచించారు.గిరిజనుల ఆర్థిక, విద్యా, సామాజిక అభివృద్ధికి జిల్లా అధికారులు, ప్రభుత్వం మరింత కృషి చేయాలని నేతలు డిమాండ్ చేశారు.

రేపు రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర

విశాలాంధ్ర- రాజంపేట : అన్నమయ్య జిల్లా రాజంపేట మండలం అన్నమయ్య పార్కు నందు దళిత సంఘాల ఆధ్వర్యంలో మీటింగ్ జరిగినది, ఈ సందర్భంగా మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షులు లింగం సంజీవ మాట్లాడుతూ రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్రని జయప్రదం చేయాలని తెలిపారు, 29వ తేదీ సోమవారం 3 గంటలకు ఆర్.ఎం.పి బంగ్లా నుండి పాత బస్టాండ్ వరకు వందలాదిమందితో పాదయాత్రను జయప్రదం చేయాలన్నారు.కాంగ్రెస్ ఎస్సీ సెల్ కన్వీనర్ నల్ల కదిరిగాళ్ళ శాంతయ్య అంబేద్కర్ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు పోల్దొడ్డి మల్లికార్జున, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎంవి రమణ, మాల మహానాడు గౌరవ అధ్యక్షులు జూరోపల్లి భాస్కర్ పాల్గొన్నారు.

మాజీ మంత్రిపెద్దిరెడ్డి, సజ్జలను కలసిన పీలేరు మాజీ ఎమ్మెల్యే

విశాలాంధ్ర-పీలేరు:మాజీమంత్రి పెద్దిరెడ్డిరామచంద్రారెడ్డి, వైసి.పి. కోఆరినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డిలను పీలేరు మాజీ ఎమ్మెల్యేచింతల రామచంద్రారెడ్డి కలిశారు.శనివారం సదుం మండలం యర్రాతివారి పల్లిలో పుంగనూరు నియోజకవర్గ వై.యస్.ఆర్.సి.పి.విస్తృత స్థాయి సమావేశం మాజీ మంత్రి పెద్దిరెడ్డిరామ చంద్రారెడ్డిఆధ్వర్యంలో నిర్వహించారు. పార్టీ బలోపేతం, కూటమి ప్రభుత్వం అను సరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు, గ్రామ స్థాయి నుంచి వైస్సార్సీపీ పట్టిష్టపరిచడం, తదితరఅంశాలపై సుధీర్ఘాంగా చర్చించారు. వై.యస్.ఆర్.సి.పి.విస్తృత స్థాయి సమావేశంలోవైసి.పి. కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి రాజంపేట శాసనసభ సభ్యులు ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి,వైకాపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్ రెడ్డి,మదనపల్లి నియోజకవర్గం ఇంచార్జి నిస్సార్ అహ్మద్ చిత్తూరు మాజీ ఎంపీ రెడ్డెప్ప,రైల్వే కోర్టు నియోజకవర్గం మాజీ శాసనసభ్యులు కోరుముట్ల శ్రీనివాసులు, మాజీ మంత్రి వర్యులు నారాయణ స్వామి ఉమ్మడి చిత్తూరు జిల్లా పార్టీ అధ్యక్షులు భూమన కరుణాకర్ రెడ్డి, వైకాపా నాయకులు, కార్యకర్తలతో కలిసి పీలేరు నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ ఉద్యోగుల 12 నెలల వేతనాలు చెల్లించండి

విశాలాంధ్ర-కడప రూరల్ : రాష్ట్రవ్యాప్తంగా ప్రకృతి వ్యవసాయ ఉద్యోగులకు 12 నెలల వేతనాలు పెండింగ్లో ఉన్నాయని పెండింగ్ వేతనాలు విడుదల చేయడంలో జాప్యం జరుగుతుందని తక్షణమే వేతనాలు విడుదల చేయాలని లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన తప్పదని ఏపీ ప్రకృతి వ్యవసాయ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.రమేష్ బాబు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.నాగసుబ్బారెడ్డిలు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. శనివారం స్థానిక ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో ముఖ్య నాయకులతో కలిసి వారు మాట్లాడారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయని ప్రోత్సహిస్తూ గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న అన్ని క్యాడర్లకు గత 2023 సంవత్సరంలో దాదాపు 8 నెలల వేతనాలు 2025 సంవత్సరంలో నాలుగు నెలల వేతనాలు పెండింగ్లో ఉన్నాయని గత వేతనాల గురించి అధికారులు ప్రభుత్వం ఏమాత్రం ఆలోచించడం లేదని ఇలా పెండింగ్లో ఉండడం వల్ల కుటుంబ పోషణ భారంగా మారిందని వారన్నారు.. అవద్రతాభావంతో పనిచేస్తున్న వీరికి ఎలాంటి మౌలిక సదుపాయాలు కల్పించడం లేదన్నారు. మహిళా ఉద్యోగులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. విషయంపై రాష్ట్ర స్థాయి అధికారులను అనేకసార్లు కలిసి విన్నవించిన ఫలితం లేని పరిస్థితి ఉందన్నారు. తక్షణమే ఐసిఆర్పి నుండి ఎంటిల వరకు పెండింగ్లో ఉన్న దాదాపు 100 కోట్ల రూపాయల వేతన బడ్జెట్లను విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని వారు హెచ్చరించారు..ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సునీలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

లలిత త్రిపుర సుందరి దేవి అవతాంలో అమ్మవారు

విశాలాంధ్ర-కడప : కడప నగరంలోని మృత్యుంజయ కుంట రాజుల వీధిలో 6వ రోజు శనివారం దుర్గమ్మ అమ్మవారు లలిత త్రిపుర సుందరి దేవి అవతారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిస్తున్నారు. అబ్బరాజు కుటుంబ దంపతులు ఎ.ప్రభాకర్ రాజు, నేలావతి అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు, ప్రజలు, కమిటీ సభ్యులు పాల్గన్నారు.

ఆరవ రోజు శ్రీ మహాలక్ష్మీ రూపంలో ఇరుగులమ్మ తల్లి

విశాలాంధ్ర-గాలివీడు : దసరా శరన్నవారిత్రుల్లో భాగంగా ఆరవ రోజైన శనివారం అమ్మవారు శ్రీ మహాలక్ష్మీ రూపంలో భక్తులకు దర్శన మిచ్చారు. పూజారివాండ్లపల్లె ఇరుగు లమ్మ తల్లికి ప్రత్యేక అలంకారణలు, విశేష పూజలు నిర్వహించారు. అనంతరం వేదపండితులు నాగఫణి కిషోర్ శర్మ మాట్లాడుతూ శరన్నవ రాత్రుల్లో మహాలక్ష్మిని పూజిస్తే మంగళప్రదమని, లక్ష్మీదేవి అంటేనే సంపదకు ప్రతిరూపం గనుక అమ్మవారిని పూజిస్తే ఎలాంటి కోరికైనా నెరవేరుతుందన్నారు. అమ్మవారు అనుగ్రహించే వరాలను బట్టి ఆమెను ఎనిమిది రూపాలలో పూజిస్తారని, వాళ్లే అష్టలక్ష్ములుగా ఆరాధిస్తా రన్నారు. దసరా సందర్భంగా మహాలక్ష్మిని కనుక పూజిస్తే ఈ అష్టలక్ష్ములంతా అనుగ్రహిస్తారన్నారు.

టిటిడి పాలకమండలి సభ్యులకు అరటిగెల అందించిన నాగినేని

విశాలాంధ్ర - రైల్వేకోడూరు : తిరుపతి తిరుమల పాలక మండలి సభ్యులు భాను ప్రకాష్ రెడ్డి నివాసానికి వెళ్లి పెద్ద అరటిగెల అందించి హృదయ పూర్వక కృతజ్ఞతలు తెలియజేసి అబిమానాన్ని చాటుకున్న బిజెపి మండల అధ్యక్షులు నాగినేని బాలసుబ్రమణ్యం.మీ లాంటి సీనియర్ నాయకుల సూచనలు సలహాలు పాటించి పార్టీ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు.

సమస్యల పరిష్కారమే ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి ధ్యేయం: బొజ్జా మైసూరారెడ్డి

విశాలాంధ్ర-పులివెందుల: సమస్యల పరిష్క రించడమే పశ్చిమ రాయలసీమ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి గారి ద్యేయం అని తెలుగుదేశం పార్టీ కడప పార్లమెంట్ కార్యదర్శులు బొజ్జ మైసూరారెడ్డి అన్నారు. ఆయన మాట్లాడుతూ శాసనమం డలిలో ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి ఉండడం రాయలసీమ జిల్లాలోని ప్రజలు అదృష్టంగా భావిస్తున్నారని తెలిపారు భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి కడప జిల్లా పులివెందుల నియోజకవర్గం లో ఉన్నటు వంటి సమస్యల్ని కాక రాయలసీమలో ఉన్నటు వంటి అన్ని నియోజకవర్గ సమస్యలను శాసనమండలిలో చైర్మన్ ద్వారా మంత్రులకు సమస్యలను తెలియజేసి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారం కోసం శాసనమండలిలో తన గళాన్ని వినిపించడం చాలా ఆనందదాయకమన్నారు. శాసనమండలిలో ముఖ్యమైన సమస్య లు అయినటువంటి రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య ఎక్కువగా ఉందని రాష్ట్ర ప్రభుత్వం ద్వారా వస్తున్నటువంటి పరిశ్రమలలో స్థానికులకే ఎక్కువ అవకాశాలు కల్పించాలన్నారు. ఇతర రాష్ట్రాల నుండి ఉపాధి కొరకు వస్తున్నటువంటి వారిని తీసుకోకుండా స్థానిక నిరుద్యోగ యువకులకు నైపుణ్య శిక్షణ ఇచ్చి వారికి అవకాశాలు కల్పిస్తే బాగుంటుందని శాసనమండలి ద్వారా మంత్రులకు ఎమ్మెల్సీ తెలియ జేయడం నిరుద్యోగ యువత సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా జమ్మల మడుగు నియోజకవర్గంలోని రాజోలు రిజర్వాయర్ కు సంబంధించి భూ సమస్యల గురించి వివరించి తక్షణ పరిష్కారం చూపాలని రైతాంగం తరుపున ప్రభుత్వాన్ని కోరడం అదేవిధంగా తిరుమల తిరుపతి దేవస్థానంలో పరకామణి లో జరిగిన అవినీతి వెలుగులోకి తీసుకొచ్చి ఇప్పటి ప్రభుత్వం ద్వారా విచారణ జరిపి అవినీతిలో భాగము భాగస్వాములైనటువంటి వారి పైన కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. కడపల్ జిల్లాలో ఆర్కిటెక్చర్ యూనివర్సిటీ కేంద్ర ప్రభుత్వం అనుమతి లేకుండా ప్రారంభించడం ద్వారా విద్యార్థులు పడుతున్నటువంటి ఇబ్బందుల గురించి కేంద్ర ప్రభుత్వ అనుమతితో అదే విధంగా కాలేజీ సొంత భవనాలను నిర్మించి శాశ్వత పరిష్కార దిశగా పరిష్కరించాలని విద్యాశాఖ మంత్రిని శాసనమండలి ద్వారా కోరడం గత ప్రభుత్వంలో రాష్ట్ర పర్యాటక శాఖలో జరిగినటు వంటి అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. అనంతపురం జిల్లా సింగనమల నియోజకవర్గంలోని పుట్లూరు ఎల్లనూరు మండలాలలోని సాగు తాగు నీరు ఇవ్వాలని ఈ రెండు మండలాలు చిత్రావతికి ఎగువన ఉన్న మండలాలు కాబట్టి వాటి వాటికి గండికోట రిజర్వాయర్ నుండి పుట్లూరు చెరువుకు నీరు పంపాలని ప్రభుత్వాన్ని కోరి ఇవే కాకుండా రాయల సీమ జిల్లాలోని అన్ని నియోజకవర్గాల పై ఆయనకు అవగాహన ఉండడం వలన శాసనమండలి లో భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి తన స్వరంతో చైర్మన్ ద్వారా రాయల సీమలో ఉన్నటువంటి సమస్యలను మంత్రుల దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వం ద్వారా సమస్యల పరిష్కా రించి రాయలసీమ జిల్లాను రతనాలసీమగా మార్చడమే భూమి రెడ్డి రాంగోపాల్ రెడ్డి ఆశయం ఆకాంక్ష అని కడప పార్లమెంటు కార్యదర్శులు బొజ్జ మైసూరా రెడ్డి రెడ్డి అన్నారు.

తెలుగు తమ్ముళ్లు ఆధ్వర్యంలో ఘనంగా నిశ్చల్ నాగిరెడ్డి జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర- లక్కిరెడ్డిపల్లి : లక్కిరెడ్డిపల్లి మండలం స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో తెలుగు తమ్ముల ఆధ్వర్యంలో రాష్ట్ర రవాణా, యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తనయుడు మండిపల్లి నిశ్చల్ నాగిరెడ్డి జన్మదిన వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. యువ నాయకుడు నిశ్చల్ నాగిరెడ్డి జన్మదినం సందర్భంగా తెలుగుదేశం పార్టీ కార్యలయంలో భారీ కేకును కటింగ్ చేసి తెలుగుదేశం పార్టీ కార్యకర్తలకు, మండిపల్లి అభిమానులకు, ప్రజలకు పంచి జన్మదిన వేడుకలు తెలుగుతమ్ముల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఉన్నత చదువుల నిమిత్తం విదేశాల్లో ఉన్న నిశ్చల్ నాగిరెడ్డి బాగా చదివి ఉన్నత పదవులను అధిరోహించాలని తెలుగుతమ్ముళ్లు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో లక్కిరెడ్డిపల్లి మండల ఇన్చార్జ్ యనమల మదన్ మోహన్‌తో పాటు, మార్కెట్ యార్డ్ చైర్మన్ డాక్టర్ ఎస్ఎండి షఫీ నాయక్, తెలుగుదేశం పార్టీ యువ నాయకులు షేక్ ఆరిఫ్, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్లు కొండూరు వెంకటరామరాజు, భాస్కర్ రెడ్డి, జె.కె రెడ్డి, మల్లీ, డీలర్ అన్వర్, సయ్యద్ మసూద్, అశోక్,ముక్తార్ అహ్మద్, సయ్యద్ రిజ్వాన్, సుధీర్, జనార్ధన్ రెడ్డి, కావులి ఆంజనేయులు, ఓబులేసు, బోనాల ధన, లక్కిరెడ్డిపల్లి ఓబులేసు, సిద్ధక వెంకట్రాంరెడ్డి, టీడీపీ కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

ప్రజలందరికీ అమ్మవారి ఆశీస్సులు అందాలి

విశాలాంధ్ర-రాయచోటి:దసరా ఉత్సవాలా సందర్భంగా రాయచోటి పట్టణంలోని గాంధీబజార్ లో కొలువైన కన్యకా పరమేశ్వరి ఆలయంలో శుక్రవారం రాత్రి వైఎస్ఆర్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి, మాజీ ఎంఎల్ఏ రమేష్ కుమార్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బాలాత్రిపుర సుందరీ దేవీ అలంకారంలో దర్శనమిచ్చిన అమ్మవారిని వారు దర్శించుకున్నారు. ఆర్య వైశ్యులు వారికి పూర్ణకుంభ స్వాగతం పలికి వారి చేత పూజలు గావింపచేసారు. దుస్సాలువతో సత్కరించారు. వేదపండితులు తీర్థ ప్రసాదాలు అందచేశారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ వంద సంవత్సరాలకు పైబడి చరిత్ర కలిగిన రాయచోటిలోని వాసవీ కన్యకా పరమేశ్వరి దేవి ఆలయాన్ని అత్యంత సుందర శిల్ప కళానైపుణ్యంతో నిర్మింప చేసుకుని ప్రతి రోజూ వైభవోపేతంగా పూజలు, దసరా ఉత్సవాలను నిర్వహిస్తుండడం అభినందనీయమన్నారు. రమేష్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడేలా ఆలయాన్ని నిర్మించుకుని, ప్రొద్దుటూరు తరువాత దసరా ఉత్సవాలు రాయచోటిలోని కన్యకా పరమేశ్వరి ఆలయంలో జరుగుతుండడం ఆనందదాయకంగా ఉందన్నారు. అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరికీ కలగాలని ఆయన ఆకాంక్షిస్తూ దసరా శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ డిసిఎంఎస్ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్ రెడ్డి, మాజీ ఎంపీపీ పోలు సుబ్బారెడ్డి, ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు పబ్బిశెట్టి సురేష్ కుమార్, కార్యదర్శి కెపిఎల్ సత్యనారాయణ, మైనారిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొలిమి హారూన్ బాష, జిల్లా అధ్యక్షుడు బేపారి మహమ్మద్ ఖాన్, వైఎస్ఆర్ సిపి జిల్లా ఉపాధ్యక్షుడు పల్లపు రమేష్, కౌన్సిలర్లు సాదక్ అలీ, సుగవాసి శ్యామ్, రియాజుర్ రెహమాన్, అన్నా సలీం, ఖలీల్, యువజన విభాగం పట్టణ అధ్యక్షుడు కొత్తపల్లె ఇంతియాజ్, కేతంరెడ్డి వాసుదేవ రెడ్డి, వాల్మీకి సంఘ అధ్యక్షుడు గువ్వల బుజ్జిబాబు, జబీఉల్లా, అశోక్,బేపారి అసద్, ఆర్యవైశ్య నాయకులు జోషి, పుష్పహాస్, రెడ్డిశంకర్, కృష్ణదేవరాయలు అంజనేయులు నాగేష్, నాగభూషణం, రాజేష్ సత్య రాజ్, రెడ్డప్ప, రామమోహన్, అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సంతకాల సేకరణలో పాల్గొన్న ఇర్ఫాన్ బాష

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలా రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ చేపట్టిన "ఓట్ చోర్-గద్దె చోడ్" క్యాంపెయిన్‌లో భాగంగా శనివారం నాడు విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలో గడప గడపకు తిరిగి సంతకాల సేకరణ కార్యక్రమంలో ప్రొద్దుటూరు కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఇర్ఫాన్ బాష పాల్గొన్నారు. ఈ సంధర్భంగా వైఎస్ షర్మిలా రెడ్డి మాట్లాడుతూ దేశంలో ఓట్ల దొంగతనం జరిగిందని, ప్రధాని మోడి ఓట్ల దొంగ అని, బీజేపి గెలుపు కోసం అవసరమైన చోట దొంగ ఓట్లు, అవసరం లేని చోట్ల ఓట్లను తొలగించి ఓట్ చోర్‌కి పాల్పడిందని ప్రజలు విశ్వసించి సంతకాలు చేసినందుకు ప్రతి ఒక్కరికి కాంగ్రెస్ పార్టీ తరపున ధన్యవాదాలు తెలిపారు.

జీఎస్టీ తగ్గింపుపై ప్రజలకు అవగాహన కల్పించాలి

విశాలాంధ్ర-సంబేపల్లె: జీఎస్టీ తగ్గింపు వల్ల చేకూరే లబ్ధిపై ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా పంచాయతీ అధికారి రాధమ్మ తెలిపారు. శనివారం సందేపల్లె మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిపిఓ మాట్లాడుతూ మండల వ్యాప్తంగా అన్ని సచివాలయాల వద్ద తగ్గిన జీఎస్టీ పై ప్రజలలో అవగాహన తీసుకొచ్చేందుకు కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఎంపీడీవో రామచంద్ర మాట్లాడుతూ జీఎస్టీ తగ్గడంతో సామాన్య ప్రజలకు ఆర్థిక భరోసా చేకూరిందని తెలిపారు. తహసిల్దార్ సుబ్రహ్మణ్యం రెడ్డి మాట్లాడుతూ తగ్గిన జిఎస్టిని పూర్తిస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. అన్ని శాఖల అధికారుల సమన్వయంతో సమావేశాలను నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు పంచాయతీ సెక్రెటరీలు తదితరులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరును జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేయాలి

మంత్రి సత్యకుమార్‌కు వినతిపత్రం అందించిన గొర్రె శ్రీనివాసులు

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: ప్రొద్దుటూరును జిల్లా కేంద్రంగా ఏర్పాటుచేయాలని రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌కు ప్రొద్దుటూరు బీజేపి అసెంబ్లీ కన్వీనర్ గొర్రె శ్రీనివాసులు వినతిపత్రం అందజేశారు. శనివారం నాడు మంత్రి సత్యకుమార్‌ను విజయవాడలో గొర్రె శ్రీనివాసులు కలిశారు. ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, మైదుకూరు నియోజికవర్గం ప్రతిపాదిత పోరుమామిళ్ల, కమలాపురం నియోజికవర్గంలోని కొంత ప్రాంతాన్ని కలుపుతూ ప్రొద్దుటూరును జిల్లా కేంద్రంగా ఏర్పాటుచేయాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. దీనికి మంత్రి సానుకూలంగా స్పందించి ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి ఈ విశయాన్ని తీసుకెళ్లి ప్రొద్దుటూరును జిల్లా కేంద్రంగా ఏర్పాటుచేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో గొర్రె శ్రీనివాసులుతో పాటు బీజేపి జిల్లా మాజీ కార్యదర్శి సుబ్రమణ్యం, బీజేపి సోషల్ మీడియా రాయలసీమ జోన్ ఇంచార్జ్ గొర్రె కృష్ణ, మంత్రి మిత్రులు ఈటీవి భాస్కర్, పెంచలయ్య, చేనేత సంఘాల నాయకుడు ఉలసాల రామచంద్రుడు మంత్రిని కలిశారు.

చల్లా రాజగోపాల్ ఆధ్వర్యంలో అన్నదానం

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: ప్రొద్దుటూరు తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షులు చల్లా రాజగోపాల్ యాదవ్ ఆధ్వర్యంలో శనివారం సంధర్భంగా పట్టణంలోని స్థానిక కొర్రపాడు రోడ్డులోని పాత బస్టాండ్ వద్ద అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. స్వీటు కేసరి, ఫ్రీ రైస్, దాల్చా, పెరుగు అన్నం, పచ్చికారం, అరటిపండ్లు దాదాపు 1000మందికి మంచి రుచికరమైన నాణ్యమైన భోజనాన్ని ప్రజలకు ఆయన అందజేశారు.

ఆ నలుగురి పాత్రలో మే ఐ హెల్ప్ యూ ఫౌండేషన్ సభ్యులు

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: పట్టణంలోని స్థానిక గవర్నమెంట్ హాస్పిటల్ నందు వడ్డరపు లక్ష్మిదేవి అనే మహిళ మరణించగా అంతిమ సంస్కరణలు చేయడానికి బంధువులు ఎవరూ లేకపోవడంతో ముద్దనూరు పోలీసు సిబ్బంది ఫోన్ ద్వారా మే ఐ హెల్ప్ యూ ఫౌండేషన్ టౌన్ ప్రెసిడెంట్ సుబహాన్‌ను సంప్రదించగా వారు వెంటనే స్పందించి శనివారం సాయంత్రం హిందూ స్మశాన వాటికలో హిందూ సంప్రదాయం ప్రకారంగా అంతిమ సంస్కరణలు నిర్వహించారు. ఇటువంటి గొప్ప కార్యక్రమానికి చేయూత అందించిన ఫౌండేషన్ చైర్మెన్ మోరే లక్ష్మణ్‌రావు, టౌన్ వైస్ ప్రెసిడెంట్ మునీంద్రా, ఈశ్వర్, వర్ధన్ రెడ్డి, కృపఅగ్ని షారూర్ ట్రస్ట్ సభ్యులు పాపిశెట్టి వెంకట లక్షుమ్మ, సుమన్ బాబు, ప్రసన్న కుమార్, మైఖేల్ బాబు మరియు తదితరులకు కృతజ్ఞతలు తెలిపారు. మా శ్రీ అమ్మ శరణాలయంలోని వృధ్ధులకు సహాయం చేయదలచిన దాతలు ఎవరైనా ఉంటే 82972 53484, 91822 44150 అనే నంబర్లకు సంప్రదించాలని కోరారు

కుట్రలు పన్ని కడప మేయర్‌ను తొలగించారు: వైసిపి

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : కడప నగర మేయర్ కె.సురేష్ బాబును హైకోర్టు తొలగించినదని టిడిపి నగర కార్యదర్శి సుబ్బారెడ్డి అబద్ధాలు చెబుతున్నారని కార్పొరేటర్ మల్లికార్జున, కే బాబు, బీసీ నాయకులు బసవరాజులు మండిపడ్డారు. ఇందులో వాస్తవం లేదు. రూల్స్‌కు వ్యతిరేకంగా పనులు చేశాడని ఆరోపణలు మాత్రమేనని, మేయర్ అవినీతి చేయలేదని చెప్పారు. కుటుంబ సభ్యులు పనులు చేయకూడదని రూల్స్ లో ఉన్నది. దేశంలో ఎక్కడా లేనివిధంగా కడపలో మాత్రమే మేయర్‌ను కుర్చీ కోసం కుట్రలు చేసి తొలగించారని ఆరోపించారు. శనివారం కడప వైకాపా కార్యంలో విలేకరులతో వారు మాట్లాడుతూ రెండు పర్యాయలు వైసీపీ కార్పొరేటర్ గా గెలిచి, మేయర్ తో అన్ని పనులు చేపించుకుని లబ్ధి పొంది.. ఇప్పుడు స్వార్థం కోసం టిడిపిలోకి వెళ్లి తల్లి పాలు తాగి తల్లి రొమ్మును గుద్దిన విధంగా కార్పొరేటర్ సుబ్బారెడ్డి వ్యవహార శైలి ఉన్నదని విమర్శించారు. మమ్మల్ని కాదని మీకే అగ్ర తాంబూలం ఇచ్చిన కృతజ్ఞతలు లేకుండా పార్టీ మారి బిసి మేయర్ సురేష్ బాబు విమర్శిస్తున్నారనీ ఆగ్రహం వ్యక్తం చేశారు. టిడిపిలో మూడు గ్రూపులుగా ఏర్పడి వాళ్ళల్లో వాళ్ళు పోట్లాడుకుంటున్నారని చెప్పారు. అలాగే కూటమి పార్టీలలో కూడా అసంతృప్తి ఉన్నది. మహిళలను గౌరవించలేని మాట్లాడడం విడ్డూరంగా ఉన్నదని, మహిళా ఎమ్మెల్యే మాధవి రెడ్డిని సర్వసభ్య సమావేశంలో వైసిపి పాలకవర్గ సభ్యులు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారని గుర్తు చేశారు. మేయర్ లేని సమయంలో ఇంటి పైన చెత్త వీశారని గుర్తు చేశారు. మహిళలైనా మేయర్ సతీమణి, కుమార్తె ఉన్న ఇంటిపై హాస్పిటల్ వ్యర్థాలను వేశారు.. ఇది మహిళలను అవమానించినట్లు కాదా అని సుబ్బారెడ్డిని నిలదీశారు. అణుడా ఫండ్ రూ.4 కోట్లు వచ్చిందని అబద్ధం చెబుతున్నారు. డి ఎంఎఫ్ ఫండ్ సెంట్రల్ ఇచ్చినది. ఇది రాష్ట్ర ప్రభు త్వం ఇవ్వలేదు. కడప నగరంలో వైసిపి పాలకవర్గం చేసిన అభివృద్ధిని కుటిమి అభివృద్ధిగా చెబుతుందని విమర్శించారు. కార్యక్రమంలో మల్లికార్జున కిరణ్, అలీ అక్బర్, గౌస్ బాషా, శివకోటి రెడ్డి, రెడ్డి ప్రసాద్, త్యాగరాజు, షబ్బీర్, జిలాని, రామ లక్ష్మారెడ్డి, బండి ప్రసాద్, చంద్రహాస్ రెడ్డి, శ్రీరంజన్ రెడ్డి, సుబ్బరాయుడు, ఈటి రామ చంద్రయ్య, అజ్మతుల్లా నాగమల్లారెడ్డి, సింధు పాల్గొన్నారు.

జీఎస్టీ సంస్కరణలపై అవగాహన సదస్సు

విశాలాంధ్ర-కొండాపురం: కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ 2.0తో చేపట్టిన సంస్కరణల వల్ల పేద, మధ్య తరగతి కుటుంబాలకు ఎంతో ఆర్థిక లబ్ది చేకూరుతుందని కొండాపురం స్టేషన్ హౌస్ ఆఫీసర్ ప్రతాప్ రెడ్డి పేర్కొన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శనివారం ఎంపీడీఓ కార్యాలయం సభా భవణం నందు జీఎస్టీ సంస్కరణలపై అవగాహన సదస్సు ఏర్పాటుచేశారు. ఈ సమావేశంనకు ఎంపీడీఓ నాగప్రసాద్ హాజరయ్యారు. ఈ సంధర్భంగా వారు మాట్లాడుతూ జీఎస్టీ 2.0 వస్తువుత ధరలు గతంలో కన్నా తగ్గుతాయని సూచించారు. ప్రతి దుకాణాదారుడు కూడ జీఎస్టీ తగ్గుదల వచ్చే ఫలాలు ప్రజలకు అందజేయాలని లేకపోతే చర్యలు తీసుకుంటామని వివరించారు. మహిళలు కూడ వాటిపై అవగాహణ పెంచుకోవాలని సూచించారు. అదేవిధంగా మహిళల భద్రత, మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాల వినియోగం, సైబర్ నేరాలపై ప్రతి ఒక్క మహిళ అవగాహణ పెంచుకొని వాటి నిర్మూళణకు సహకారం అందజేస్తూ గ్రామాల్లో మహిళలను చైతన్యవంతులుగా తయారు చేసే విధంగా ప్రోత్సహించాలని మహిళా సంఘ సభ్యులకు వివరించారు.

శ్రీ దేవి శరన్నవరాత్రుల మహొత్సవాలు

విశాలాంధ్ర-బ్రహ్మంగారిమఠం : ప్రముఖ పుణ్యక్షేత్రమైన వీరబ్రహ్మేంద్ర స్వాములవారి జగన్మాత ఈశ్వరి దేవి ఆశీస్సులతో శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి ఆలయం దేవి శరన్నవరాత్రి ఉత్సవములు అంగరంగ వైభవంగా ప్రారంభమై అమ్మవారిశాల, కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు అభిషేకాలు వివిధ కార్యక్రమాలతో పాటు, అమ్మవారిని దర్శనానికి బ్రహ్మంగారి వెంకటాద్రి స్వామి దంపతులకు పూర్ణకుం భంతో స్వాగతం పలుకుతున్న ఆలయం అర్చకులు, అధ్యక్షులు వెంకటసురేష్ బాబు దంపతులు ప్రత్యేక స్వాగతం పలికారు. అదేవిధంగా తెలుగుదేశం పార్టీ, అధ్యక్షుడు చెన్నుపల్లి సుబ్బారెడ్డి నాయకులు కానాల మల్లికార్జునరెడ్డి, పూజ శివ యాదవ్ తెలుగుదేశం సీనియర్ నాయకులు మల్లెపల్లె సర్పంచ్, చిలుమల నారాయణ యాదవ్ ఆయన సతీమణి, లక్ష్మీదేవి, అమ్మవారిని ప్రత్యేకంగా దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ కార్యదర్శి సుంకు సురేష్ బాబు, ముచ్చర్ల శేషయ్య, ముచ్చర్ల సత్యనారాయణ, వెంకటాద్రి స్వామి దంపతులకు శాలువా కప్పి పూల మాల సత్కరించి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమం లో ఆర్యవైశ్య మహిళలు,కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

తోట సుధాకర్ ప్రసాద్ వర్ధంతి వేడుకలు

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: ఏపీ ఎన్జీవో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కీ.శే తోట సుధాకర్ ప్రసాద్ 24వ వర్ధంతి సంధర్భంగా ప్రొద్దుటూరు ఏపీ ఎన్జీవో అసోసియేషన్ భవణంలో రాష్ట్ర ఏపీ ఎన్జీవో అధ్యక్షుడు కామ్రేడ్ అలపర్తి విద్యాసాగర్ మరియు ప్రధాన కార్యదర్శి రమణ ఆదేశానుసారం జిల్లా అధ్యక్షులు శ్రీనివాసులు మరియు జిల్లా కార్యదర్శి నిత్య పూజయ్య ఆదేశానుసారం ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సంధర్భంగా ప్రొద్దుటూరు అధ్యక్షులు రఘురామి రెడ్డి మరియు కార్యదర్శి రామసుబ్బయ్య వారు చేసిన సేవలు గురించి గొప్పగా కొనిఆడారు. ఈ కార్యక్రమంలో ప్రొద్దుటూరు సహాధ్యక్షుడు సదాశివయ్య, వైస్ ప్రెసిడెంట్ శివరామానుజ, మధు, జాయింట్ సెక్రటరీ రాజశేఖర్, మహేశ్వరయ్య, మాజీ సెక్రటరీ వెంకటేశ్వర్లు, విశ్రాంత ఉద్యోగులు నాగన్న, లక్ష్మినారాయణ, జాకోబ్ మరియు సచివాలయం ఉద్యోగులు, ప్రొద్దుటూరు అధ్యక్ష కార్యదర్శులు పీరా మరియు ఓంకార్‌లు పాల్గొన్నారు.

హెచ్ఐవి/ఎయిడ్స్ నిర్మూలనపై రాష్ట్ర స్థాయి క్యాంపెయిన్

విశాలాంధ్ర- ప్రొద్దుటూరు: ఆంధ్రప్రదేష్ హెచ్ఐవి/ఎయిడ్స్ నిర్మూళణ మరియు నియంత్రణ మండలి, కడప జిల్లా హెచ్ఐవి, ఎయిడ్స్ నివారణ మరియు నియంత్రణ మండలి ఆదేశాల మేరకు చైతన్య ఎడ్యుకేషనల్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో "ఐఈసీ హెచ్ఐవి ఎయిడ్స్ నిర్మూళణపై అవగాహణ కార్యక్రమం" పట్టణంలోని శ్రీ సాయి రాజేశ్వరి నర్సింగ్ కాలేజి నందు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రామాంజమ్మ, లెక్చరర్‌లు స్రవంతి, తేజస్విని, కరిష్మా మరియు విధ్యార్థులు ఎస్ఐఆర్‌డీఎస్ స్వచ్ఛంద సంస్థ సిబ్బంది భాగ్యలక్ష్మిలు పాల్గొన్నారు. ఈ సంధర్భంగా ప్రాజెక్ట్ మేనేజర్ పి.నరేష్ కుమార్ మాట్లాడుతూ ఆరోగ్య కరమైన జీవనశైలి, ఆరోగ్యకరమైన ఆహారం, అలవాట్లు, రక్తదానం, సోషల్ మీడియా మోసాల గురించి తెలిపారు. ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు 2నెలల పాటు నాకో నేతృత్వంలో రాష్ట్ర స్థాయి ఇంటెన్సిఫైడ్ ఐఈసి క్యాంపెయిన్ కార్యక్రమాన్ని అంతర్జాతీయ యువజన దినోత్సవం సంధర్భంగా దేశవ్యాప్తంగా నిర్వహించడం జరుగుతోందని తెలిపారు. హెచ్.ఐ.వి ఎయిడ్స్ నిర్మూళణలో హెచ్ఐవి బాధితులకు అందించే సేవలు ఎంతో ప్రాముఖ్యత ఇస్తాయి అని మరియు క్యూఆర్ కోడ్ స్కానింగ్ ద్వారా ప్రతి ఒక్కరూ వారి యొక్క స్టేటస్ తెలుసుకోవచ్చు అన్నారు. హెచ్ఐవి ఎయిడ్స్ పట్ల ప్రజల్లో అవగాహన పెంచి ప్రభుత్వం అందించే సేవలను వాటి ప్రాధాన్యత గురించి తెలిపారు.

రెగ్యులరైజేషన్ చేయండి

స్టగుల్ కమిటీ రాష్ట జాయింట్ సెక్రటరీ కమల్

విశాలాంధ్ర: -కడప: కడప నగర శివార్లోని ప్రభుత్వ సర్వజన వైద్య శాల రిమ్స్ లో జిల్లా స్టగుల్ కమిటీ యూనియన్ నాయకులు జిజిహెచ్ రిమ్స్ సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్ రావు,సీఎస్ ఆర్ ఎం ఓ డాక్టర్ వై .శ్రీనివాసులు కలిసి వినతి పత్రం సమర్పించారు. ఆంధ్రప్రదేశ్లో ఉన్న స్టాఫ్ నర్సులు వైద్య,డైరెక్టర్ విద్య ఆంధ్ర ప్రదేశ్ నియంత్రణలో జిల్లా ఎంపిక కమిటీ ద్వారా స్పష్టమైన ఖాలీ పోస్టులు లేదా మంజూరు చేయబడిన పోస్టులలో కాలిచేయబడిన కాంట్రాక్ట్ ప్రాతిపదికన మేము నియమించ బడ్డాము అని ర స్టగుల్ కమిటి రాష్ట్ర జాయింట్ సెక్రటరీ జి.కమల్ బి చెప్పుకొస్తూ పేర్కొన్నారు. వారు మాట్లాడుతూ మేము 10సంవత్సరాలుగా ఆంధ్రప్రదేశ్ లోనిబోధనా ఆసుపత్రిలో పనిచేస్తున్నము.కానీ మాకు పట్టించుకొనే నాథుడే లేరని ఎద్దేవా చేశారు. వ్యక్తిగతంగా వృత్తిపరంగా చాలా సమస్యలు ఎదుర్కొంటున్నాము. మరి కోవిడ్ 19 సమయంలో ఆరోగ్య బాధితులకు ఆరోగ్య సమస్యలను అందించడంలో మా సహొూద్యోగులలో కొందరు కొవిడ్ రోగులకు సేవలను అందిస్తూ బాధపడి మరణించారు. ఇప్పటికీ తమకు రెగ్యులైజేషన్ చేయకపోగా ఆ సమస్యలను పట్టించుకునే నాథుడే కరువయ్యారు. తాము ఆరోగ్య కార్డు విషయాల ప్రకారం పిల్లల పాఠశాల ఫీజు మరియు కుటుంబ నిర్వహణ చెల్లించడానికి ఇబ్బందులను ఎదుర్కొంటున్నామన్నారు. కుటుంబ పోషనులకై చాలా ఇబ్బందులు పడుతున్నామన్నారు. తయ సమస్యలు డిఎంఈ కి ఫార్వర్డ్ చేసి సమస్యలు పరిష్కరించాలని వేడుకొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రెసిడెంట్ విజయశ్రీ ,మెంబర్లు శ్రీనివాసులు, సుప్రజ,స్రవంతి,మౌనిక, షబాన,సుధ,అశ్విని తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ జాతీయ సమితి సభ్యుడిగా ఈశ్వరయ్య ఎన్నికపై హర్షం

విశాలాంధ్ర-కడప రూరల్ : సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జి.ఈశ్వర య్య సెప్టెంబర్ 21 నుండి 25 వరకు చండీగఢ్‌లో జరిగిన సిపిఐ జాతీయ మహాసభలలో జాతీయ సమితి సభ్యుడిగా ఎన్నిక కావడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నట్లు సిపిఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జి.ఈశ్వ రయ్య విద్యార్థి, యువజన, కార్మిక, రైతు, దళిత, మైనారిటీ హక్కుల కోసం సాగించిన అనేక పోరా టాలను గుర్తు చేసుకున్నారు. ఏఐ ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్య దర్శిగా యువతకు ఉపాధి అవకాశాల కల్పన, ఉద్యోగ ఖాళీల భర్తీ, క్రీడలు-సంస్కృతిక రంగాల అభివృద్ధి, మద్యం-మాదకద్రవ్యాల వ్యతిరేక పోరాటాల్లో ముందుం డారు. సిపిఐ కడప జిల్లా కార్య దర్శిగా జిల్లా సమగ్ర అభివృద్ధి కోసం కడప ఉక్కు ఫ్యాక్టరీ సాధన కోసం ఉద్ధృత పోరాటాలను నిర్వ హించారన్నారు.రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షునిగా రైతులకు మద్దతు ధరల సాధనకు కృషి చేస్తున్నార న్నారు.అనేక పోరాటాలకు నేతృ త్వం వహిస్తున్న ఈశ్వరయ్య జాతీయ స్థాయికి ఎన్నిక కావడం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

ప్రచారంతోనే పర్యాటక ప్రగతి :వల్లూరు బ్రహ్మయ్య

విశాలాంధ్ర-కడప కలెక్టరేట్ : విస్తృత ప్రచారంతో పర్యాటక ప్రదేశాల సందర్శన అభివృద్ధి జరుగుతుందని ప్రముఖ సైకాలజిస్ట్ డా. వల్లూరు బ్రహ్మయ్య అన్నారు. ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని 27వ తేదీ శనివారం రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ ప్రధాన కార్యదర్శి కొండూరు జనార్ధన రాజు ఆధ్వర్యంలో జిల్లాలోని ప్రముఖ పర్యాటక ప్రాంతాల ఫోటోల ప్రదర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. డా.బ్రహ్మయ్య మాట్లాడుతూ మన చుట్టుప్రక్కల గల పర్యాటక ప్రాంతాలను దర్శించేందుకు మనం తొలి ప్రాధాన్యతనివ్వాలన్నారు. పర్యాటక అంశంలో మన జిల్లా గండికోటతో ప్రపంచస్థాయిలో సగర్వంగా నిలబడగల్గిందన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్యాట్రన్ పద్మప్రియ చంద్రారెడ్డి, చరిత్ర అధ్యాపకులు బాల గొండ గంగాధర్, పర్యాటక అభిమానులు గొబ్బూరి కోటేశ్వరరావు, డేవిడ్, శ్రీనివాసులు, రామలింగారెడ్డి, విజయ్ కుమార్ బాబు మాట్లాడారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

సమస్యలపై వేగంగా స్పందించాలి చమర్తి జగన్ మోహన్ రాజు

విశాలాంధ్ర -రాజంపేట : అధికారులు ప్రజా సమస్యలపై వేగంగా స్పందించాలని, అలాగే కూటమి కార్యకర్తలకు గౌరవం ఇస్తూ గ్రామాలలో అధికారులు, నేతలు కలిసి అభివృద్ధిలో భాగస్వాములు కావాలని రాజంపేట టీడీపీ ఇంచార్జి చమర్తి జగన్ మోహన్ రాజు సూచించారు.శనివారం రాజంపేట లో అధికారులతో ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు ప్రభుత్వ ఆదేశాల ప్రకారం వ్యవహరిస్తూ సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలన్నారు. ప్రజలను ఆఫీసులో చుట్టూ తిప్పుకోకుండా వారి సమస్యలను సానుకూలంగా విని సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజంపేట ఎమ్మార్వో పీరు మున్నీసా, కుమారస్వామి, ఆర్ఐ శేషం రాజు, రెవిన్యూ అధికారులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతో ఇబ్బందా.. డిజిటల్ బుక్‌లో ఫిర్యాదు చేయండి

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : కూటమి ప్రభుత్వంలో ఇబ్బంది పడుతున్న వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు నాయకులు డిజిటల్ బుక్‌లో ఫిర్యాదు చేయవచ్చునని నాయకుడు జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్ రెడ్డి, ఎమ్మెల్యే దాసరి సుధ, మాజీ డిప్యూటీ సీఎం అంజాద్ భాష, కడప పార్లమెంట్ పరిశీలకుడు అజయ్ రెడ్డి రాజంపేట పార్లమెంట్ పరిశీలకుడు సురేష్ బాబు కడప మేయర్ ముంతాజ్ బేగం శనివారం కడప వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో డిజిటల్ బుక్ పోస్టర్ ఆవిష్కరించారు ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం వచ్చి పదహారు నెలల్లో ప్రజలకు మేలు చేయలేదన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతల విషయంలో బీహార్ ను మించిపోయింది.వైకాపా నేతలు కార్యకర్తలపై దొంగ కేసులు పెడుతున్నారు. పాత కేసులు తెరపైకి తెచ్చి జైల్లో పెడుతున్నారన్నారు.దొంగ కేసులతో రాక్షసానందం పొందుతున్నారు తప్పుడు కేసులపై హైకోర్టు వార్నింగ్ ఇచ్చిన వారికి బుద్ధి రాలేదన్నారు. హైకోర్టు వార్నింగ్ ఇచ్చినా పోలీసుల్లో మార్పు రాలేదు ఇబ్బంది పడిన కార్యకర్తలు, నేతలకు భరోసా ఇచ్చేందుకు డిజిటల్ బుక్ తయారు చేశారన్నారు. ఈ యాప్‌లో ఏ రోజు సంఘటన ఆరోజే యాప్‌లో రిజిస్టర్ చేయాలన్నారు.ప్రతి సామాన్య ప్రజలు డిజిటల్ బుక్ యాప్ డౌన్లోడ్ చేసుకొని అన్యాయం ఎక్కడ జరిగిన అప్లోడ్ చేయాలని కోరారు. ఎవరికైతే అన్యాయం జరిగిందో వారికి న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తా మన్నారు.ప్రభుత్వాలు ఐదు సంవత్సరాలే ఉంటుందని అధికారులు గుర్తు పెట్టుకోవాలి. నాయకుల మెప్పు కోసం ఇబ్బంది పెడితే మూల్యం చెల్లించుకుంటారన్నారు. ఈ కార్యక్రమంలో యాదయ్య, షంషీర్, వెంకటేశ్వర్లు, దాసరి శివ, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

మహారాజ కేఫ్‌ను ప్రారంభించిన బత్యాల

విశాలాంధ్ర -రాజంపేట : రాజంపేట పట్టణం మన్నూరులోని వెటర్నరీ హాస్పిటల్ ఎదురుగా కోట ఆదినారాయణ నూతనంగా ఏర్పాటుచేసిన "మహారాజ కేఫ్" ను శనివారం మాజీ ఎమ్మెల్సీ, టీడీపీరాష్ట్ర ప్రధాన కార్యదర్శి బత్యాల చంగల్ రాయుడు ప్రారంభించారు.ఈ సందర్భంగా బత్యాల షాప్ యజమాని కోట తిరుపాల్ కుమారుడు కోట ఆదినారాయణను వారి కుటుంబసభ్యులను శాలువాతో సత్కరించి శ్రీ వెంకటేశ్వర స్వామి తీర్థ ప్రసాదాలను అందజేసి మీరు కష్టమర్ల మన్నలను పొంది దిన దినాభివృద్ధి చెందాలని ఆశీర్వదించారు.ఈ కార్యక్రమంలో పలువురు కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కోట మృత్యుంజయ రావుకి రాష్ట్ర పర్యాటక రంగ ఎక్సలెన్స్ అవార్డు

విశాలాంధ్ర-కడప వైవీయూ : యోగి వేమన విశ్వ విద్యాలయం లలిత కళా విభాగం అధిపతి కోట మృత్యుంజయ రావుకి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర టూరిజం అథారిటీ ప్రకటించిన పర్యాటక రంగ అవార్డులు-2024-25 సంవత్సరానికి ఎక్సలెన్స్ ఇన్ రైటింగ్‌లో అవార్డు ప్రకటించింది. ప్రపంచ పర్యాటక రంగ దినోత్సవం సందర్భంగా ఈనెల 27వ తేదీన విజయవాడ, తుమ్మలపల్లి కళా క్షేత్రంలో నిర్వహించిన అవార్డ్ ఫంక్షన్‌లో సీఎం చంద్ర బాబు చేతుల మీదుగా అవార్డు ప్రదానం జరిగింది. మృత్యుంజయ రావు ప్రసిద్ధ పర్యాటక ప్రదేశాలు మీద , ఆలయ శిల్పాలు, కుడ్య చిత్రాలు, హస్త కళలు వాటి విశిష్టత మీద వ్రాసిన పరిశోధన పత్రాలు, టూరిజం అభివృద్ధికి చేసిన కృషికి గాను ఈ అవార్డు లభించింది. రాయలసీమ టూరిజం సొసైటీ జాయింట్ సెక్రటరీగా, అవార్డు పట్ల విశ్వ విద్యాలయం వైస్ ఛాన్సలర్ అల్లం శ్రీనివాస రావు, రిజిస్ట్రార్ పుత్తా పద్మ, ప్రిన్సిపాల్ టీ. శ్రీనివాస్, ఇంటాక్ జాతీయ కార్యవర్గ సభ్యుడు, కడప జిల్లా ఇంటాక్ అధ్యక్షులు కంభం చిన్నప్ప రెడ్డి, రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ కార్యదర్శి కొండూరు జనార్దన రాజు, పంతుల పవన్ కుమార్, అభినందించారు.

మీరు నన్ను ఆదరించారు..మీకు ఇచ్చిన హామీ గుర్తుంది.. ఎమ్మెల్యే మాధవి రెడ్డి

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : ఎన్నికల్లో మీ వద్దకు నేను వచ్చినప్పుడు మీరు అడిగినవి నాకు గుర్తున్నాయని మీరు అడిగిన దేవాలయానికి అభివృద్ధి చేసేందుకు కట్టుబడి ఉన్నానని కడప ఎమ్మెల్యే మాధవి రెడ్డి అన్నారు. శనివారం కడప నగరం 38వ డివిజన్‌లో పేద ఇంటి పట్టాల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే, ముఖ్య అతిథులుగా విచ్చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి సర్కార్ పేదల స్వంతింటి కలను సాకారం చేసే హామీకి కట్టుబడి ఇళ్ల పట్టాల పంపిణీ చేపడుతోందని తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఇళ్ల పట్టాల పంపిణీ పేరుతో ప్రచారం నిర్వహించుకోవడం తప్ప పేదలను ఆదుకున్న పాపాన పోలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పేద ప్రజలకు గూడు కల్పించాలన్న ఉద్దేశంతో పట్టాల పంపిణీతోపాటు ఇళ్లకు నిర్మాణానికి తమ వంతుగా తోడ్పాటు అందించడం జరుగుతోందన్నారు. ముఖ్యంగా కడప నగరంలోని యానాది కాలనీలో చాలా కాలంగా ఇళ్ల పట్టాల పంపిణీలో ఉందని, ఈ విషయాన్ని గుర్తించి వాటి పంపిణీకి చర్యలు చేపట్టామన్నారు. పేద వర్గాల సంక్షేమాన్ని కాంక్షిస్తూ ముందుకు సాగుతున్న కూటమి ప్రభుత్వ తోడ్పాటును లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు. అనంతరం ఎమ్మెల్యే స్వయంగా లబ్ధిదారులైన పేదలకు పట్టాలు పంపిణీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో. టిడిపి నగర అధ్యక్షులు మన్సూర్ అలీఖాన్. స్థానికులు సుభాష్, జాహిద్, గిరి టీడీపీ నేతలు, కార్యకర్తలు, లబ్ధిదారులుపాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి :ఎం.రమేష్ బాబు

విశాలాంధ్ర-కడప రూరల్ : ఆంధ్రప్రదేశ్ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర మూడవ మహాసభలు అక్టోబర్ 11, 12 తేదీల్లో విజయవాడలోని దాసరి భవన్‌లో నిర్వహిస్తున్నామని ఈ మహాసభల జయప్రదం కోసం కార్మిక వర్గం కృషి చేయాలని, రాష్ట్రవ్యాప్తంగా కార్మికుల ఉపాధి దెబ్బతీసే సెంట్రల్ కిచెన్ విధానాన్ని వ్యతిరేకిస్తున్నామని ఈ విషయంపై ప్రత్యక్ష పోరాటానికి సిద్ధపడతామని ఏపీ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.రమేష్ బాబు ఏఐటీయుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎల్.నాగ సుబ్బారెడ్డిలు హెచ్చరించారు. శనివారం స్థానిక ఏఐటీయుసీ జిల్లా కార్యాల యంలో కడప జిల్లా మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ జిల్లా జనరల్ బాడీ సమావేశం కామాక్షమ్మ అధ్యక్షతన నిర్వహించారు.. ఈ కార్యక్రమంలో ఎం. రమేష్ బాబు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 86వేల మంది పేద మహిళా కార్మికులు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం లో పనిచేస్తున్నారని ప్రభుత్వాలు మారుతున్నాయని పథకాల పేరు మారుస్తున్నారని అయినా కార్మికుల బతుకులు మారడం లేదని వారు విమర్శించారు. ప్రభుత్వాలు సెంట్రలైజ్ కిచెన్ పేరుతో ప్రైవేటీకరణ చేయడానికి కుట్ర చేసిందని, దీన్ని వ్యతిరేకిస్తున్నా మన్నారు. సెంట్రలైజ్డ్ కిచెన్ విధానం వల్ల అనేక ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని వారన్నారు.. తక్షణమే వీరికి కనీస వేతనం 10000 రూపాయలు ఇవ్వాలని వారి డిమాండ్ చేశారు. ఏఐటియుసి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగ సుబ్బారెడ్డి, వేణుగోపాలు మాట్లాడుతూ కడప జిల్లాలో సెంట్రల్ లైజ్డ్ కిచెన్ వల్ల దాదాపు 2000 మంది పేద మహిళా కార్మికుల ఉపాధి దూరమయ్యే పరిస్థితి ఉందని తక్షణమే కిచెన్లకు వ్యతిరేకంగా ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఏపీ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సులోచనమ్మ మేరీ తదితరులు పాల్గొన్నారు.